

అక్షరమే ఆయుధంగా అవినీతిని ఎండకడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యన వారధిగా..
సారధిగా కొనసాగుతూ 30 వసంతాలు జరుపుకుంటున్న ఈ శుభతరుణంలో జాతీయ తెలుగు
దినపత్రిక వార్త పత్రికకు ఇవే మా హార్ధిక శుభాకాంక్షలు

R.K. HOSPITAL
Dr. Ramakanth Regalla
M.S. (Ortho) Gold Medalist,
Regd. No. 54856, Peddapalli Dist, Cell: 9490255234



కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 23, జూన్ 2026 16 పేజీలు



విధులు నేర్పించే వారే...

వీధి రౌడీలైతే....?

2 లో

బయటకు చెప్తే చంపేస్తామంటూ బెదిరింపు...!

జిల్లా కేంద్రంలో ఘటన

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: అవును.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం శ్రమించే పోలీసులకు విధులు నేర్పించే అధికారులే వీధి రౌడీల్లాగా మారారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ ఇంట్లోకి చొరబడి యువకుడిని బయటకు లాగి అతని కుటుంబ సభ్యులు కాళ్ళ వేళ్ళ పడ్డ కనికరించకుండా ఖాకీల కాటిన్యం ప్రదర్శించిన తీరు జిల్లా పోలీసు ప్రతిష్టకే మచ్చ తెచ్చే విధంగా మారిందనే చర్చ ప్రజల్లో కొనసాగుతుంది. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో ఉన్న పోలీస్ శిక్షణ కళాశాలకు చెందిన అధికారులు రౌడీ లాగా మారి దాడి చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తప్పుచేసిన వారిని కటకటాల్లోకి నెట్టాల్సిన పోలీసులు వారి తప్పును కప్పిపుచ్చుకునేందుకు బయటకు రాకుండా నడిపిన ఈ వ్యవహారంపై

ప్రభాతవార్త ప్రత్యేక కథనం...



రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహా ధాన్యం కుంభకోణంపై విజిలెన్స్ ఎంట్రీతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు .. కాంట్రాక్ట్ కేటుగాళ్ల వెనుక పెద్దలు ఉన్నారా ?

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త : రాజన్న సిరిసిల్ల జిల్లా అపెరల్ పార్కు వేదికగా జరిగిన కోట్లాది రూపాయల ధాన్యం కుంభకోణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, వేలాది టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించిన ఈ వ్యవహారంలో రోజుకో కొత్త నిజం బయటపడుతోంది. కేవలం కాంట్రాక్ట్ ఉద్యోగులే ఇంత పెద్ద స్కామ్‌కు పాల్పడ్డారా? లేక వారి వెనుక డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు, రాజకీయ అండదండలు ఉన్నాయా? అనే కోణంలో విజిలెన్స్, రంగంలోకి దిగడంతో సిరిసిల్ల జిల్లాలో ప్రకంపనలు మొదలయ్యాయి.

నారు పోసేది ఎలా..?

కరెంట్ కష్టాలు.. రైతులకు శాపం...

నారు పోసేందుకు వ్యవసాయ మోటార్లకు నిలిచిన కరెంట్
నేలరాలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు..
25 రోజులుగా కరెంటు కోసం రైతుల నిరీక్షణ..
పట్టించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు

2 లో





ప్రజల వద్దకే ప్రజా పాలన..

ఇందిరమ్మ ఇండ్లు పేదింటి సొంత కళ : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ప్రభాతవార్త, పెగడపల్లి: ప్రజల వద్దకే ప్రజాపాలనందిస్తున్నామని, ఇందిరమ్మ ఇల్లు పేదింటి సొంత కళ అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు, 9 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

విధులు నేర్పించే వారే...

వీధి రౌడీలైతే....?

బయటకు చెప్తే చంపేస్తామంటూ బెదిరింపు...!

జిల్లా కేంద్రంలో ఘటన

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: అవును.... శాంతి భద్రతల పరిరక్షణ కోసం శ్రమించే పోలీసులకు విధులు నేర్పించే అధికారులే వీధి రౌడీల్లాగా మారారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఓ ఇంట్లోకి చొరబడి యువకుడిని బయటకు లాగి అతని కుటుంబ సభ్యులు కాళ్ళ వేళ్ళ పడ్డ కనికరించకుండా ఖాకీల కాటిన్యం ప్రదర్శించిన తీరు జిల్లా పోలీసు ప్రతిష్టకే మచ్చ తెచ్చే విధంగా మారిందనే చర్చ ప్రజల్లో కొనసాగుతుంది. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో ఉన్న పోలీస్ శిక్షణ కళాశాలకు చెందిన అధికారులు రౌడీ లాగా మారి దాడి చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తప్పుచేసిన వారిని కటకటాల్లోకి నెట్టాల్సిన పోలీసులు వారి తప్పును కప్పిపుచ్చుకునేందుకు బయటకు రాకుండా నడిపిన ఈ వ్యవహారంపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం...

అసలేం జరిగింది....?

నగరంలోని రాంనగర్ ప్రాంతంలో శుక్రవారం ముగ్గురు పోలీసు అధికారులు ఓ ఇంట్లోకి చొరబడి యువకుని బయటకు తీసుకువచ్చి చితకబాదారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారడంతో విషయం వెలుగు చూసింది. ముందుగా వచ్చిన ఒక అధికారి యువకుని బయటికి తీసుకువచ్చి కొట్టడంతో పాటు మరో ఇద్దరు అధికారులకు అక్కడకి చేరుకొని, యువకుడు కాళ్లు పట్టుకున్న కనికరించకుండా నిర్మాణంలో ఉన్న భవన సామాగ్రి కర్రలతో దాడి చేసేందుకు ప్రయత్నించిన్లు తెలుస్తోంది. అడ్డువచ్చిన కుటుంబ సభ్యులను బెదిరించడమే కాక దగ్గరికి వస్తే చంపేస్తామంటూ వార్నింగ్ ఇచ్చారనే ఆరోపణలు లేకపోలేదు.బాధిత యువకుడు కాళ్లు పట్టుకున్న కనికరించకుండా చితకబాదిన పోలీసుల తీరుపై స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులమంటూ ఈ వ్యవహారంలో తలదూర్చ వద్దని అందరికీ వార్నింగ్ ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.యువకుని కుటుంబ సభ్యులు ప్రాధేయపడే ప్రయత్నం చేసిన కనికరించకుండా యువకుడిపై దాడి చేసిన వైనం నగరంలో హాట్ టాపిక్ గా మారింది. తప్పు జరిగితే ఫిర్యాదు లేకున్నా కేసు నమోదు చేసి విచారించే విచక్షణాధికారం కలిగిన పోలీసు శాఖ ఈ ఘటనపై ఇంతవరకు నోరు మెదపకపోవడం అనుమానాలకు దారితీస్తుంది. అయితే దాడికి పాల్పడిన పోలీసులు,పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ,ఇద్దరు ఎస్ఐలు అని నిర్ధారించినట్లు ప్రాథమిక సమాచారం..



దాడి వెనుక కారణాలేమిటో....?

ఒక సాధారణ యువకుడిని ఇంటి నుంచి బయటికి తీసుకువచ్చి దాడి చేసే విచక్షణారహితంగా కొట్టడం వెనక కారణాలు ఏమై ఉంటాయని చర్చ జరుగుతుంది. దీనికి తోడు దాడి చేసిన సమయంలో పోలీస్ అధికారులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేయడంతో సదరు యువకుడు పోలీస్ అధికారులకు మధ్య ఏదైనా గొడవ జరిగి ఉంటుం దా అనే విషయం తెలియాల్సి ఉంది. మద్యం మత్తులో ఉన్న అధికారులను బాధిత యువకుడు ఏదైనా ప్రశ్నించి ఉంటాడా... లేక వారి తప్పులను ఎత్తిచూపి ఉంటాడా... లేకపోతే ఎందుకు దాడి చేస్తారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి... ఏం జరిగినా పోలీస్ అధికారులుగా ఉండి యువకుడు తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, వ్యవహరించిన తీరు పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తుందనే చర్చ కొనసాగుతుంది. ఇంత జరిగిన సంబంధిత ఘటన ప్రాంతం వచ్చే స్టేషన్ పరిధిలో ఎటువంటి ఫిర్యాదు ఆదివారం వరకు నమోదు కాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దెబ్బలుతిన్న యువకుడు ఒకవేళ ఆసుపత్రిపాలై ఉంటాడా అనే అనుమానాలు కూడా లేకపోలేదు. ఇక దిద్దుబాటు చర్యలో భాగంగా పోలీస్ అధికారులు కూడా ముందస్తు ఫిర్యాదు చేసే అవకాశం ఉన్న ఆదివారం వరకు బయటకు రాకపోవడం కూడా విచిత్రమే. ఏది ఏమైనప్పటికీ పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపై ప్రజల్లో కలకలం రేపుతుంది... దొంగతనం అనుమానంపై తీసుకువచ్చిన మహిళను స్టేషన్లోనే చితకబాదిన పోలీసుల తీరుపై ఇప్పటికే చర్యలు తీసుకున్న....ప్రశ్నించిన యువకుడిని చితక బాధడమేమిటిని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బంది పని తీరుపై, వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే తప్ప ఇలాంటి ఘటనలు పునరావృతం కావు అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నారు పోసేది ఎలా..?

కరెంట్ కష్టాలు, రైతులకు శాపం.

నారు పోసేందుకు వ్యవసాయ మోటార్లకు నిలిచిన కరెంట్

నేలరాలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు..

25 రోజులుగా కరెంటు కోసం రైతుల నిరీక్షణ..

పట్టించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు

మానకొండూర్,ప్రభాతవార్త: వ్యవసాయ పంట సాగుకు నారు మడులు సిద్ధం చేసుకుందామంటే ఇటీవల కురిసిన అకాల భారీ వర్షంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు నేలమట్టమై వ్యవసాయ మోటార్లకు వచ్చే కరెంటు నిలిచిపోవడంతో 25 రోజులుగా కరెంట్ లేక కరెంటు కష్టాలతో రైతన్నలు ఇబ్బందులను ఎదుర్కొంటున్న విద్యుత్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన లేరని రైతులు ఆరోపిస్తున్నారు. మానకొండూరు మండలంలో మే 27న , అర్ధరాత్రి భారీ వర్షం, బీభత్సమైన ఈదురు గాలులతో మండల వ్యాప్తంగా వర్షం కురిసి మండలంలోని లింగాపూర్, వెల్ది, రంగపేట, లక్ష్మీపూర్, వేగురుపల్లి, ఊటూర్ గ్రామాలపై ప్రకృతి కన్నేర చేసింది. దీంతో ఐదు గ్రామాలలో రైతన్నలకు, భారీ నష్టం చేకూరిందని తెలిపారు. వర్షం ఈదురు గాలులకు ఐదు గ్రామాల పరిధిలో 130 విద్యుత్ స్తంభాలు, 20 ట్రాన్స్ ఫార్మర్లు నేలమట్టమయ్యాయి. అంతేకాకుండా వెల్ది నుండి లక్ష్మీపూర్ కు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో నాలుగు రోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ మోటార్లకు కరెంటు లేక 25 రోజులు గడుస్తుందన్నారు. నారుమడులు సాగు చేద్దామంటే కరెంటు లేక, వర్షాలు లేక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపిస్తున్నారు. వ్యవసాయ నమ్ముకుని రైతులను జీవిస్తున్నామని చుట్టుపక్కల గ్రామాలలో రైతులు పంట సాగుకు నార్లు పోసుకున్నారని మా గ్రామాలలో మాత్రం దున్నేందుకు కరెంటు లేక పంట సాగు కు వెనుకబడి పోతున్నామని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు విరిగి పొలాల మధ్యలోనే ఇంకా అలాగనే ఉన్నాయని నేటికీ మరమ్మత్తులకు నోచుకోవడం లేదని తెలిపారు. విరిగిపోయిన స్తంభాలకు, ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మత్తులకు అయ్యే ట్రాన్స్పోర్ట్, ఖర్చులను రైతులే భరించుకోవాలని తెలిపారు.

ప్రజల వద్దకే ప్రజా పాలన

ఇందిరమ్మ ఇండ్లు పేదింటి సొంత కళ : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ప్రభాతవార్త, పెగడపల్లి: ప్రజల వద్దకే ప్రజాపాలనందిస్తున్నామని, ఇందిరమ్మ ఇల్లు పేదింటి సొంత కళ అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు, 9 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు సేవ చేయడం తన ప్రధాన బాధ్యత అని అన్నారు. పేద ప్రజల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబం కలగంటున్న సొంతింటి స్వప్నాన్ని సాకారం చేయడమే తన లక్ష్యమని, అందులో భాగంగా అర్హులైన నిరుపేదలకు జూలై నెల నాటికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం పెగడపల్లి మండలానికి రూ.2.51 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులతో గ్రామాల మధ్య రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు.అదేవిధంగా, మండల వ్యాప్తంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చేసి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సాగునీటి వసతుల విస్తరణతో పెగడపల్లి మండలాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, డిప్యూటీ తాసిల్దార్ శిరీష, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఎంపీ ఓ శశి కుమార్ రెడ్డి, ఆర్ఐలు శ్రీనివాస్ , జమున, నందగిరి సింగల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఓరగల అరుణ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు కదారి తిరుపతి, నాయకులు సంధి మల్లారెడ్డి, మందపల్లి అంజయ్య, మోకినపల్లి గోపాల్, తడగొండ రాజు, ఎలగొండ కృష్ణ హరి, పూసాల తిరుపతి, కుంచే రాజేందర్, ఇస్లావత్ రవి నాయక్, దీకొండ మహేందర్,సుంకే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ రాకతో వెలుగులోకి

ధాన్యం దందా...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహా ధాన్యం కుంభకోణంపై విజిలెన్స్ ఎంట్రీతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

కాంట్రాక్ట్ కేటుగాళ్ల వెనుక పెద్దలు ఉన్నారా ?

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త : రాజన్న సిరిసిల్ల జిల్లా అపెరల్ పార్కు వేదికగా జరిగిన కోట్లాది రూపాయల ధాన్యం కుంభకోణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, వేలాది టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించిన ఈ వ్యవహారంలో రోజుకో కొత్త నిజం బయటపడుతోంది. కేవలం కాంట్రాక్ట్ ఉద్యోగులే ఇంత పెద్ద స్కామ్‌కు పాల్పడ్డారా? లేక వారి వెనుక డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు, రాజకీయ అండదండలు ఉన్నాయా? అనే కోణంలో విజిలెన్స్, రంగంలోకి దిగడంతో సిరిసిల్ల జిల్లాలో ప్రకంపనలు మొదలయ్యాయి.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఖాతాల్లో లక్షల గిలగిల...

ఇంత పెద్ద బాధ్యతలు ఎలా ఇచ్చారు?

ఈ కుంభకోణంలో ప్రాథమికంగా వినిపిస్తున్న పేర్లు కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులవి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కీలకమైన ధాన్యం నిల్వలు, వాటి రవాణా, మరియు రికార్డుల నిర్వహణ వంటి బాధ్యతలను శాశ్వత అధికారుల పర్యవేక్షణలో ఉంచాలి. కానీ, సిరిసిల్ల అపెరల్ పార్కు పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగులదే రాజ్యంగా సాగింది. వేలాది టన్నుల ధాన్యాన్ని చేతులు మార్చేంత విచక్షణాధికారాలు, నమ్మకం వీరికి ఎలా కల్పించారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ స్కామ్ వెలుగుచూసిన వెంటనే సదరు కాంట్రాక్ట్ ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో లక్షలాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు, నిధులు గిలగిలా కొట్టుకుంటూ చేతులు మారినట్లు సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో నగదు చలామణి అవుతున్నా ఉన్నతాధికారులు కళ్ళు మూసుకున్నారా? లేక చూసీచూడనట్లు వదిలేశారా? అనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి.ధాన్యంలో తూకాలు తక్కువ రావడం, నిల్వల్లో తేడాలు రావడం సిరిసిల్ల జిల్లాకు కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు ధాన్యం నిల్వలపై లెక్కలు తేడాలొచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ, అప్పట్లోనే తూతూమంత్రంగా విచారణలు జరిపి కేసులను తొక్కిపెట్టారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకపోగా, వాటిని ఒక అలవాటుగా మార్చుకుని ఈసారి ఏకంగా వేలాది టన్నుల ధాన్యాన్ని మాయం చేసేశారు. పౌరసరఫరాల శాఖలోని కొందరు కీలక అధికారులు నిరంతరం తనిఖీలు (ఫిజికల్ వెరిఫికేషన్) చేయాల్సి ఉన్నా, ఆ పని చేయకపోవడం వెనుక వారి ¯మామూళ్ళ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. గత కొన్ని సంవత్సరాలనుండి ఈ కుంబకోణం సాగుతుందనే ఆరోపణలు వెల్లువె త్తు న్నాయి.

లోతుగా విచారిస్తే.. ఆ శాఖ గుట్టు రచ్చకెక్కడం ఖాయం!

ప్రస్తుతం పోలీసులు ఈ కేసును ప్రాథమికంగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కేవలం కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రమే అరెస్ట్ చేసి చేతులు దులుపుకోకుండా, పోలీసులు మరింత లోతుగా విచారణ జరపాల్సి ఉంది. ఈ ధాన్యం ఏ ఏ మిల్లులకు తరలిపోయింది? ఆ సమయంలో పౌరసరఫరాల శాఖ (సివిల్ సప్లైస్) అధికారులు ఏ రకమైన పర్మిట్లు ఇచ్చారు? అనే సాంకేతిక అంశాలపై దృష్టి పెడితే.. పౌరసరఫరాల శాఖకు చెందిన కొందరు¯పెద్ద తలకాయల్ల భాగోతం పూర్తిగా బయటపడే అవకాశాలు ఉన్నాయనే చర్చలు సాగుతున్నాయి. అధికారుల సంతకాలు, ఆమోదం లేకుండా వేలాది టన్నుల ధాన్యం పార్క్ దాటి బయటకు వెళ్ళడం అసాధ్యమని పేర్కొంటున్నారు.

రంగంలోకి విజిలెన్స్ అధికారులు....

ధాన్యం కుంభకోణం తీవ్రత దృష్ట్యా విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. సిరిసిల్ల పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ (డిఎం) అధికారులతో విజిలెన్స్ బృందం ప్రత్యేకంగా సమావేశమై రికార్డులను పరిశీలిస్తోంది. అపెరల్ పార్కులో ఎంత ధాన్యం దిగుమతి అయింది, ఎంత నిల్వ ఉండాలి, ప్రస్తుతం ఎంత తక్కువగా ఉంది అనే లెక్కలను క్షుణ్ణంగా స్కానింగ్ చేస్తున్నారు. పోలీసులు సేకరించిన ప్రాథమిక ఆధారాలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కాల్ డేటా, బ్యాంక్ స్టేట్‌మెంట్లను విజిలెన్స్ అధికారులు నిశితంగా పరిశీలించ నున్నారు. విజిలెన్స్ ఎంట్రీతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ విచారణ గనుక పారదర్శకంగా సాగితే, సిరిసిల్ల ధాన్యం స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు త్వరలోనే జైలు పాలు కావడం ఖాయమని ప్రజలు అనుకుంటున్నారు.

బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల లక్ష్యం

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైమ్), ప్రభాతవార్త:

ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి,వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎవ్వుడైనా సీపీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్న వారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి పలు ఫిర్యాదులు అందాయి.వీటిపై వెంటనే స్పందించిన పోలీస్ కమిషనర్, సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుల వివరాలను



తెలుసుకున్నారు.చట్ట పరిధిలో ఉన్న ప్రతి ఫిర్యాదుపై ఎలాంటి జాప్యం లేకుండా, పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో అత్యంత సున్నితంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉత్తమ లక్ష్యాలపై దృష్టి సారించాలి

పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, ఏసీపీ జీ. కృష్ణ

గాయత్రి జూనియర్ కాలేజీలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

డ్రగ్స్ కు దూరంగా ఉండి ఉత్తమ లక్ష్యాలపై దృష్టి సారించాలి అని పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, ఏసీపీ జీ. కృష్ణ విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పెద్దపల్లిలోని గాయత్రి జూనియర్ కాలేజీలో అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, ఏసీపీ జీ. కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు ఎలా నాశనమవుతాయో తెలియజేశారు.



ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని చేరుకోవడానికి స్పష్టమైన లక్ష్యాలను ఎంచుకుని వాటిపైనే దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. చట్టవ్యతిరేకమైన పనులకు దూరంగా ఉంటూ చదువుల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సీఐ కే. ప్రవీణ్ కుమార్, ఎస్ ఐ కే. నరేష్, కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు జిల్లా న్యాయమూర్తిగా భాధ్యతల స్వీకరణ

గోదావరిఖని ,ప్రభాతవార్త:



గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తిగా నియమితులైన కోట్ల లావణ్య బాల్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమెను బార్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బల్మూరి అమరేందర్ రావు,గుజ్జేటి సత్యనారాయణ ,ఉపాధ్యక్షులు కుడిది వెంకటేష్,సంయుక్త కార్యదర్శి ముచ్చకుర్తి కుమార్,నాయకులు అసంపల్లి రవీందర్,జాగిరి రాజయ్య,ప్రసన్న ,అంజలి,షానవాజ్ ఖాన్,తిలక్,చిదురాల రమేష్,కోర్ట్ అదనపు జీపీ శాంతన్ కుమార్ మర్యాద పూర్వకం గా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు.

వార్త కథనానికి స్పందన

పోలీసుల అదుపులో నకిలీ స్టాంపుల నిండితుడు

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం సనుగుల గ్రామంలో ఇంటి మార్పిడి కోసం నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తాహా సిల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన నిందితున్ని చందుర్తి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు, ఈ నిందితుడు తాహాసిల్దార్ సంతకం ఫోర్జరీ తోపాటు పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేయడంతో ఈ వ్యవహారం వార్త దినపత్రికలో ఈనెల 19వ తేదీన నకిలీ స్టాంపుల గుట్టు రట్టయ్యేనా..... అనే వార్తా ప్రచురణ కావడంతో స్పందించిన పోలీసులు వేములవాడ పట్టణంలో నకిలీ స్టాంపులు తయారు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నారు, ఈ విచారణలో భాగంగా పెద్ద ఎత్తున నకిలీ స్టాఫ్ లు ఇందుకు ఉపయోగించిన కంప్యూటర్, స్కానర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, ఈ నకిలీ ముద్రల తయారీలో ఎవరెవరి పాత్ర ఉందన్నా కోణం పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఈ విచారణలో భాగంగా నిందితుడికి పంచాయతీ కార్యదర్శి తో పాటు ఓ ఫీల్డ్ అసిస్టెంట్ పూర్తిస్థాయిలో సహకరించినట్టు తెలుస్తుంది.

అనారోగ్యంతో బాధపడుతున్న అభిదామియాకు

లక్ష రూపాయల ఎల్ఓసి అందజేత



రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం మంజూరు

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

అనారోగ్యంతో బాధపడుతున్న అభిదా మియాకు లక్ష రూపాయల ఎల్ఓసి అందజేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణారావు తెలిపారు. సోమవారం పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ అభిదా మియా అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అభిదాకు రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణారావు రూ. 1,00,000 ఎల్ఓసి మంజూరు చేయించారు.పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఈ ఎల్ఓసి పత్రాన్ని అభిదా కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణారావు స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరుపేదలు అనారోగ్యానికి గురైనప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిదా కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యమే భవిష్యత్‌కు బలమైన పునాది

= దీప్తి మహిళ సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత



ఎన్టీపీసీ,ప్రభాతవార్త:స్థానిక యువతలో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చే లక్ష్యంతో నిర్వహించిన రెండు నెలల కంప్యూటర్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఎన్టీపీసీ రామగుండం సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా, దీప్తి మహిళా సమితి సహకారంతో ఈ శిక్షణ నిర్వహించారు.ముగింపు కార్యక్రమానికి దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు శ్రీమతి రాఖీ సమంత ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు. కంప్యూటర్ అనువర్తనాలు, ట్యాలీ, వస్తు సేవల పన్ను వంటి రంగాల్లో అందించిన శిక్షణ యువతకు ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి తెలంగాణ ప్రభుత్వ ఉపాధి శాఖ గుర్తింపు పొందిన ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువత సాధికారత, నైపుణ్యాభివృద్ధి, సమాజ పురోగతికి ఎన్టీపీసీ రామగుండం నిరంతరం కృషి చేస్తోందని వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో దీప్తి మహిళా సమితిసభ్యులు,అధ్యాపకులు, సామాజిక బాధ్యత విభాగం ప్రతినిధులు, శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు-దారుణాలు

బైక్ దొంగతనం చేసిన పాత నేరస్థుడి అరెస్ట్

పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ కే. నరేష్

నిందితుడి నుండి స్ప్లెండర్ ప్లస్ బైక్ స్వాధీనం

పెద్దపల్లి, ప్రభాతవార్త:



బైక్ దొంగతనం చేసిన పాత నేరస్థుడిని అరెస్ట్ చేశామని పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ కే. నరేష్ తెలిపారు. సోమవారం పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బంధంపల్లి ఫ్లై ఓవర్ వద్ద ఎస్ ఐ కే. నరేష్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా ఒక బైక్ పై అనుమానాస్పదంగా వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. వాహనానికి సంబంధించిన కాగితాల గురించి ప్రశ్నించగా అతను చేసిన దొంగతనం నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడిని బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామానికి చెందిన బోర్కుటి సంజీవ్ గా గుర్తించారు. నిందితుడి వద్ద నుండి దొంగిలించిన స్ప్లెండర్ ప్లస్ బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో 19.06.2026 నాడు మధ్యాహ్నం 2 గంటల సమయంలో పాత బజార్ ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి రవీందర్ శివాలయం వీధిలో గల తన అక్క ఇంటి వద్ద బైక్ పార్క్ చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు బైక్ దొంగిలించారని రవీందర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు బోర్కుటి సంజీవ్ గతంలో బెజ్జూర్, సిర్పూర్ కాగజ్ నగర్, సిరిసిల్ల, కరీంనగర్ ప్రాంతాలలో కూడా దొంగతనాలు చేసి జైలుకు వెళ్లినట్లు తెలిసింది. దొంగను పట్టుకున్న ఎస్ ఐ కే. నరేష్, పోలీస్ కానిస్టేబుల్ ప్రభాకర్, సతీష్ లను ఉన్నత అధికారులు అభినందించారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి

నలుగురు అరెస్ట్ 18940 నగదు,4 సెల్ ఫోన్లు స్వాధీనం

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:



కొత్తపల్లి మండల కేంద్రంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఏసిపి సతీష్ ఆధ్వర్యంలో దాడులు కొనసాగాయి.ఈ దాడులలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని 18940 నగదు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూదం నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం మేరకు పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. జూదం లో పట్టుబడిన నలుగురిని స్వాధీనం చేసుకున్న నగదును వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీసులకు అప్పగించారు.

భూ వివాదంపై కలెక్టర్‌కు పల్లికొండ బీమయ్య పిర్యాదు

ఎన్ని ఫిర్యాదులు చేసిన

ఫలితం శూన్యమని ఆవేదన

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం రోజున జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రాయకల్ మండల కేంద్రానికి చెందిన పల్లికొండ గంగయ్య కుమారుడు పల్లికొండ బీమయ్య తన భూమి విషయంలో తలెత్తిన వివాదంపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా పల్లికొండ బీమయ్య తెలిపిన వివరాల ప్రకారంతన తండ్రి. పల్లికొండ గంగయ్యకు రాయికల్ మండల కేంద్రంలో 1075 సర్వే నెంబర్లో 14 గుంటల స్థలం ఉంది.అందులో నుండి 1980లో 7.5 గుంటల భూమిని కాలగిరి గంగారెడ్డికి సాదా బై నామ ద్వారా అమ్మగా 1989 పహానియాలో నమోదైనదని అన్నారు.. అదే సర్వే నెంబర్ దొడ్డ పసంత్ రెడ్డి2005 నుండి 2006 లో పహానిలో 2.5 గుంటల (302.5 గజాలు) భూమిని పహానిలో ఉన్నట్లు చూపిస్తున్నారని పేర్కొన్నారు.2013లో దొడ్డ పసంత్ రెడ్డీ తను కొనుగోలు చేసిన భూమి 208 గజాల స్థలాన్ని దాసరి ఆనందం కు అమ్ముకున్నారని తెలిపారు.మిగిలిన 94.5 గజాల స్థలాన్ని వసంత రెడ్డి 2016లో డాక్యుమెంట్ నెంబర్ 3042 ద్వారా 39 గజాలు కాలిగిరి గంగారెడ్డికి అమ్మగా, అతనికి 55.5 గజాలు మాత్రమే మిగిలి ఉన్నదని పేర్కొన్నారు. అంతేకాకుండా2016లో కాలగిరి గంగారెడ్డి రాయకల్ తహసీల్దార్ కు దొడ్డ పసంత్ రెడ్డి యొక్క పేరును పహనీ నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేసిన కానీ ఆ భూమిని పహాని నుండి తొలగించలేదని దీంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింద అని పేర్కొన్నారుగతంలో పనిచేసిన ఎమ్మార్వో పహాని నుండి భూమినీ తొలగించక పోవడంతో , దొడ్డ వసంత్ రెడ్డి 2017లో 293 గజాల స్థలాన్ని కట్టం రాజేశంకు విక్రయించడం జరిగిందని పేర్కొన్నారుదీంతో పల్లికొండ బీమయ్య తాను పూర్తిగా నష్టపోతున్నానని, దొడ్డ పసంత్ రెడ్డి భూమి డాక్యుమెంట్ లపై, నా డాక్యుమెంట్లపై విచారణ చేసి , తనకు న్యాయం చేయాలని పేర్కొన్నారుతాను పేద కుటుందానికి చెందిన వాడినని అనేక సంవత్సరాల నుండి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని, అధికారులు తనకు న్యాయం చేసి ఆదుకోవాలని లేని పక్షంలో మా కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఉన్నదనీ పల్లికొండ బీమయ్య కన్నీరు కారుస్తూ ఆవేద వ్యక్తం చేశారు.

సారంగాపూర్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన నీరజ

సారంగాపూర్ ప్రభాత వార్త :



సారంగాపూర్ మండల నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా సోమవారం నీరజ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్ప గుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. .ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ చేరవేసేలా పారదర్శకంగా సేవలందిస్తామని, గ్రామాల సమగ్ర ప్రగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఆమె స్పష్టం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు

ముత్తారం ఎస్ఐ ఎన్. రవి కుమార్

గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలు

సహకరించాలని పిలుపు

ముత్తారం, ప్రభాతవార్త:



మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు ఉంటాయి అని ముత్తారం ఎస్ఐ ఎన్. రవి కుమార్ హెచ్చరించారు. సోమవారం ముత్తారం మండలం లక్కారం గ్రామంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో ముత్తారం ఎస్ఐ ఎన్. రవి కుమార్ పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాల రవాణా లేదా విక్రయాలు జరిపితే చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. కొంతమంది స్వార్థపరులు యువతను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి అక్రమ వ్యాపారాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై నిఘా ఉంచామని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదువుకుంటూ లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను, స్నేహితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని ముత్తారం ఎస్ఐ ఎన్. రవి కుమార్ సూచించారు. చిన్న వయసులోనే వ్యసనాల బారిన పడి జీవితాలను, కుటుంబాలను రోడ్డున పడేసుకోవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడానికి యువత, ప్రజలు పోలీసులతో చేతులు కలపాలని పిలుపునిచ్చారు. లక్కారం గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల సరఫరా జరిగినట్లు ఎలాంటి సమాచారం ఉన్నా నిర్భయంగా పోలీసులకు తెలపాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను రహస్యంగా ఉంచు తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్కారం గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ వద్ద పోలీసు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలి

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త::



జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత పెట్రోల్, డీజిల్ పంపును తక్షణమే ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను కలిసి లేఖను అందజేసినట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖను సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్కు అందజేశారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, పాత బస్టాండ్ సమీపంలోని పోలీసు క్వార్టర్స్ స్థలాన్ని వాణిజ్యపరంగా వినియోగించే అవకాశం ఉందన్నారు. ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు మెరుగైన సేవలు అందడంతో పాటు ట్రాఫిక్ రద్దీ సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల అనుమతులు కూడా లభించినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ పెట్రోల్ బంక్ ఆదర్శవంతంగా నిర్వహించబడితే వచ్చే ఆదాయాన్ని పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందని చెప్పారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పంపు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్ బంక్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ముఖ్య మంత్రికి రాసిన లేఖ ప్రతిని పోలీసు ఉన్నతాధికారులకు పంపడంతో పాటు లేఖను ఉన్నతాధికారులకు అందజేసినట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు.

ప్రజావాణికి 192 దరఖాస్తులు

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఫైల్ ట్రాకింగ్ చేస్తున్నామని దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా పరిష్కరించడానికి అన్ని చర్యలుతీసుకోవాలని కలెక్టర్ చిత్ర మీశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 192 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ వారిగా ఆన్లైన్లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామని చెప్పారు. శాఖల వారీగా దరఖాస్తుల సంఖ్య, పెండింగ్ దరఖాస్తులను సమీక్షించారు. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో అశ్విని తానాజీ వాకడే, డిఆర్ఓ స్వామి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల వార్త



ప్రభుత్వ విద్యపై విశ్వాసం చాటిన భీమారం సర్పంచ్ కుటుంబం

భీమారం, ప్రభాతవార్త :



భీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రోజున భీమారం గ్రామ సర్పంచ్ చెక్కపెల్లి స్వాతి-సంజీవ్ దంపతుల కుమారుడిని చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా, తమ సొంత కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తమకు ఉన్న నమ్మకాన్ని ఆచరణలో చూపించి ఆదర్శంగా నిలిచారు. ప్రజాప్రతినిధులు మాటల్లో కాకుండా చేతల్లో చూపించినప్పుడే ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందనే విషయాన్ని మరోసారి నిరూపించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇటువంటి నిర్ణయాలు ఎంతో ప్రేరణనిస్తాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడులపై ప్రజల్లో నమ్మకం పెంపొందించే దిశగా ఇది ఒక మంచి ముందడుగుగా నిలిచింది. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దామెర పరమేష్, వార్డ్ సభ్యులు చిలివేరి వెంకటేష్, చిలివేరి లత, చెక్కపల్లి పుష్పలత, ఏలేటి లక్షి ్మ, దాసరి శేఖర్ తదితరులు పాల్గొని సర్పంచ్ కుటుంబాన్ని అభినందించారు.

ప్రజావాణిలో 12 దరఖాస్తులు

కోరుట్ల, ప్రభాతవార్త :

కోరుట్ల డివిజన్ స్థాయిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజాల నుండి ఫిర్యాదులు, వినతులను డివిజన్ స్థాయి అధికారులతో కలిసి స్వీకరించారు. ఈ ప్రజావాణి ద్వారా మొత్తం 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఆర్డీవో జీవాకర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ కేంద్రంతో పాటు డివిజన్ లోని పలు మండలాల నుండి ప్రజల సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వచ్చారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ లో కోరుట్ల విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, ప్రభాతవార్త :



హైదరాబాద్లోని సుల్తాన్బజార్ వీపీజీ గ్రౌండ్స్లో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్లిఫ్టింగ్ ఛాంపియన్షిప్లో కోరుట్లకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. పట్టణానికి చెందిన కళ్లెడ రోహిత్ కుమార్, యు. మన్వితో గోల్డ్ మెడల్స్ సాధించగా, గిన్నెల నిపుణ్ తేజ్ సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఈ విజయాలతో ముగ్గురు క్రీడాకారులు ఆగస్టులో ఢిల్లీలో జరగనున్న జాతీయ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్షిప్కు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందిస్తూ, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు

కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి: జూన్ 22, ప్రభాతవార్త:

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయవద్దని, బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారి క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే స్పందించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయ లోపం ఉండొద్దని, ఒకరి మీద ఒకరు నెట్టుకోకుండా సత్వర న్యాయం చేయాలని సూచించారు.ప్రజావాణిలో ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు, కొత్త పింఛన్ల మంజూరు, భూ సమస్యలు, ధరణి పెండింగ్ దరఖాస్తులు, విద్య, వైద్యం, తాగునీటి సమస్యలపై పెద్ద సంఖ్యలో అర్జీలు అందాయి. బాధితులు తమ గోడును కలెక్టర్‌కు వివరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, త్వరలో జిల్లా ప్రత్యేక



అధికారి "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"పై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, విజయగాథలతో కూడిన నివేదికలను పక్కాగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమం చివరలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ రూపొందించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" అవగాహన గోడపత్రాలను కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆవిష్కరించారు. మత్తు పదార్థాల నియంత్రణకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్‌తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 22, ప్రభాతవార్త:

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టడానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని



ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్ లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువులపై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్,
మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవి

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త

జిల్లాలో క్రీడల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్,



మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణి లతో కలిసి అధికారులతో సమీక్షి ంచారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో క్రీడారంగం తో పాటు మైదానాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ క్రీడా మైదానం కొరకు కేటాయించిన స్థలాన్ని మైదానం అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పన, కౌటాల మండల కేంద్రంలో గల మినీ స్టేడియం అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాలపై వివరించారు. అనంతరం క్రీడా శాఖ అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలోని జనకాపూర్ క్రీడా మైదానం, ఆదర్శ క్రీడా పాఠశాల మైదానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టరేట్ కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కు జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, క్రీడ శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై దుష్ప్రచారం

రుద్రంగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రం గంగ నర్సయ్య



రుద్రంగి ప్రభాత వార్త :ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదుర్కోలేకనే తమ నాయకుడు రాష్ట్ర ప్రభుత్వ విప్,కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక మున్నూరు కాపు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పై కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని రుద్రంగి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రం గంగ నరసయ్య మండిపడ్డారు.ప్రజల్లో ఆది శ్రీనివాస్ పై రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక రాజకీయ ప్రత్యర్థులు నిరాధార ఆరోపణలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు.ఒక సామాన్య కుటుంబం నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆది శ్రీనివాస్ తన కష్టంతో,ప్రజల సమస్యలపై నిరంతర పోరాటంతో ఈ స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు.ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా,డబ్బు,అధికార అండదండలు లేకుండా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన మహోన్నతమైన గుర్తింపు పొందారని అన్నారు.ఇటీవల వెలుగులోకి వచ్చిన ధాన్యం అక్రమ రవాణా కేసును అడ్డం పెట్టుకుని కొందరు కావాలనే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరును వివాదంలోకి లాగేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.ధాన్యం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యుడు కాంగ్రెస్ నాయకుడు కావడమే తప్ప,ఆది శ్రీనివాస్‌కు ఆ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.అయినప్పటికీ ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు అసత్య ప్రచారానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చట్టం ముందు అందరూ సమానమే ఎవరైనా తప్పు చేసి ఉంటే దర్యాప్తు సంస్థలు,న్యాయవ్యవస్థ తమ పని తాము చేసుకుంటాయి అన్నారు.ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రజా ప్రతినిధులను కేసులతో ముడిపెట్టడం రాజకీయ నీచ సంస్కృతికి నిదర్శనం" అని ధ్వజమెత్తారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న ఈ దుష్ప్రచారం ప్రజల్లో ఏమాత్రం ప్రభావం చూపదని వారు ధీమా వ్యక్తం చేశారు.రాజకీయ ప్రత్యర్థులు అసత్యాలను ఎంతగా ప్రచారం చేసినా అవి సత్యాలుగా మారవని,చివరకు నిజమే గెలుస్తుందని స్పష్టం చేశారు.

చిన్నారి విరాట్‌కు కాలేయ మార్పిడి కోసం..

శ్రీ భగవతీ హెల్పింగ్ క్లబ్ ఆర్థిక సాయం

ఎన్టీపీసీ,ప్రభాతవార్త:



విల్సన్ వ్యాధితో బాధపడుతూ కాలేయ మార్పిడి శస్త్రచికిత్స కోసం పోరాడుతున్న 8 ఏళ్ల చిన్నారి మనాల విరాట్‌కు శ్రీ భగవతీ హెల్పింగ్ క్లబ్ సభ్యులు అండగా నిలిచారు. క్లబ్ తరఫున సోమవారం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, విరాట్ ప్రాణాలను కాపాడేందుకు అత్యవసరంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. ఇందుకు సుమారు రూ.25 లక్షల వ్యయం అవుతుందని, నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు మనాల తిరుమలేశ్, స్వప్నలు ఆ మొత్తాన్ని భరించలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.దాతృత్వ హృదయం కలిగిన వారు ముందుకు వచ్చి చిన్నారి చికిత్సకు తమ వంతు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంకటి రవి గౌడ్, బత్తిని శేఖర్, పైడ సాయి, మడుపు విజయ్, పొరండ్ల తిరుపతి పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ల హక్కుల సాధనకై మహాధర్నా

జగిత్యాల టౌన్‌ప్రభాతవార్త

ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, గ్రామ పాలనలో వారికి తగిన గుర్తింపు కల్పించాలనే లక్ష్యంతో జూన్ 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఉప సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి మెరుగు జంపన్న (జానీ), రాష్ట్ర ఉపాధ్యక్షులు గానవేణి నందిని మల్లేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి ఆధ్వర్యంలో జగిత్యాలలోఛలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఉప సర్పంచ్‌లు సోమవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకుముందు జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి ఆధ్వర్యంలో తహసీల్ చౌరస్తా వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించి మహాధర్నా విజయవంతానికి కార్యాచరణను ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు ముత్యాల స్వామి మాట్లాడుతూ గ్రామ పాలనలో ఉప సర్పంచ్‌ల పాత్ర కీలకమైనదని, అయినప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను నిరక్ష ్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు పై వస్తున్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, తప్పుదు ప్రచారాలను ఖండించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లందరికీ ప్రతినెల రూ.5వేలు,వార్డు సభ్యులకు రూ.3వేల గౌరవ వేతనం ప్రకటించాలని కోరారు. గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఉప సర్పంచ్‌లను ద్వితీయ పౌరులుగా అధికారికంగా గుర్తించి, వారికి తగిన అధికారాలు, గౌరవం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం ఎన్నోసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా స్పందన రాకపోవడంతో ఆత్మగౌరవమే లక్ష ్యంగా, హక్కుల సాధనే ధ్యేయంగా జూన్ 25న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో భారీ స్థాయిలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాదిమంది ఉప సర్పంచ్‌లు పాల్గొని తమ హక్కుల కోసం గళమెత్తనున్నారని వెల్లడించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు.ఇట్టి కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగ తిరుపతి కన్వీనర్ గుర్రం తిరుపతి, జగిత్యాల రూరల్, అర్బన్ మండల అధ్యక్షులతో పాటు జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు తిరుపతి యాదవ్, పురెధి, అన్నారపు నర్సయ్య,శ్రీనివాస్, ముత్యం రెడ్డి, నర్స గౌడ్, రాకేష్ సాగర్, మొగుల సంజీవ్ చారి, వీరేశం, క్రాంతి, స్వామి, శ్యామ్,పరమేష్,రాకేష్ , ఏకాంబరం, జలేందర్, సింహారెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై చర్యలు తీసుకోవాలి

బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరేంద్ర



మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పునరుద్ధరణతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేపట్టిన "మన ఊరు-మన బడి" కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొన్నిచోట్ల దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దెబ్బతిన్న భవనాలు, ఇతర మౌలిక వసతులను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన విద్యాసంస్థల నిర్మాణ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను భారీగా పెంచి వసూలు చేస్తున్నాయని జెట్టి నరేంద్ర ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య అందని ద్రాక్షగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఐఐటీ, నీట్, ట్రిపుల్ ఐటీ కోర్సుల పేరుతో అదనపు ఫీజులు, నోట్‌బుక్స్ తదితరాల కోసం అధిక మొత్తాలు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి సారించి ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ఎండీ ముక్తార్, దానవేని రాజ్‌కుమార్, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50శాతం రాయితీ కల్పించాలి

ప్రజవాణి లో వినతిపత్రం అందచేసిన జర్నలిస్టులు.



మెట్‌పల్లి,ప్రభాతవార్త: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 రాయితీ కల్పించాలని జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) పక్షాన ప్రజావాణిలో రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహారావు కి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఆర్డీవో సానుకూలంగా స్పందించి..జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వాలని పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థలను ఆదేశించాలనీ డిఈవో రాము కు వినతి పత్రాన్ని పంపించారని జర్నలిస్ట్ నాయకులు తెలిపారు.ఈసందర్భంగా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు డా.బూరం సంజీవ్,మహమ్మద్ అజీమ్ లు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో కాలం గడుపుతున్నారన్నారు.జర్నలిస్టు వృత్తినే సామాజిక సేవగా భావిస్తూ పనిచేస్తున్న చాలామంది జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించడానికి ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా సహ కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు జంగం విజయ్,అఫ్రోజ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా,బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి,పిండిరి శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్,తదితరులు పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

మెట్‌పల్లి, ప్రభాతవార్త:



చక్కర కర్మాగారం, రైతు సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా రైతులు సామూహిక ధర్నాలు చేపట్టగా..ప్రభుత్వం కొంత మంది పై మాత్రమే పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని రైతు సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు.జిల్లా వ్యాప్తంగా 5000 మంది రైతులు పాల్గొంటే కక్షపూరితంగా 36 మంది రైతులపై అప్పటి ప్రభుత్వం రైతులపై అక్రమ కేసులు బనాయించి కోర్టు చుట్టూ తిప్పడంతో రైతులు చాలా ఇబ్బందులకు పడుతున్నమన్నారు .వ్యవసాయంపై ఆధారపడే రైతులం పశువులు, పంటలను వదిలి కోర్టు చుట్టూ తిరగడం జరుగుతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా గత ప్రభుత్వం మా రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే రద్దుచేసి రైతులకు న్యాయం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 2021 నుండి ఇప్పటివరకు కోర్టు చుట్టూ తిరగడం జరుగుతుందని,రైతులపై దయ తలచి వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న మమ్మల్ని ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ,ప్రజా పాలన రైతు శ్రేయస్సు కోరే ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తపరిచారు .ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి,కోడిపెల్లి గోపాల్ రెడ్డి,బి.మల్లయ్య,బద్దం శ్రీనివాస్ రెడ్డి,ఆలూరి మహేందర్ రెడ్డి ,మారు మురళీధర్ రెడ్డి,వేముల కర్ణాకర్ రెడ్డి ,నాగుల వామన్ రెడ్డి, ఏలేటి మహిపాల్, తదితరులు ఉన్నారు.

వర్షాలు కురవాలని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

మెట్‌పల్లి కల్చరల్, ప్రభాతవార్త :



మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఉత్తర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ దంపతులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ఆకుపచ్చ వస్త్రాన్ని సమర్పించి ప్రత్యేక అర్చనలు నిర్వ హించారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులకు అధిక దిగుబడులు లభించి వ్యవసాయం లాభసాటిగా మారాలని వారు ప్రార్థించారు. అలాగే ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

సర్పంచ్ పుల్ల జగన్ గౌడ్.



మెట్‌పల్లి,ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని,ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సర్పంచ్ పుల్ల జగన్ గౌడ్ అన్నారు .మండలంలోని జగ్గసాగర్ ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ పుల్ల జగన్ ఆధ్వర్యములో విద్యార్థులకు సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వ హించారు. ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లితండ్రులకు సూచించారు. అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలు పంపిణి చేయడం జరిగింది. ఈకార్యక్రమములో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు లక్ష్మన్, మధుర, తేజ,లక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి వార్త



మెటుపల్లి ఎంపీడీఓగా మహేందర్ రెడ్డి

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



మెటుపల్లి ఎంపిడీవో గా మహేందర్ రెడ్డి సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా మెటుపల్లి ఎంపిడీవో సురేష్ సిద్దిపేట జిల్లా వర్గల్ కు బదిలీ పై వెళ్లగా..ఇంచార్జ్ ఎంపీడీఓ గా కోరుట్ల కోరుట్ల ఎంపిడీవో వోదెల రామకృష్ణ ఇటీవల భాద్యతలు స్వీకరించారు.ప్రస్తుతం పూర్తి స్థాయి ఎంపీడీఓ గా ధర్మపురి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీవో గా మహేందర్ రెడ్డి బాధ్యతలు నిర్వర్తించి,ఎంపిడీవో గా పదోన్నతి పై మెటుపల్లి కి రావడం జరిగింది.

శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ఎదురుగా సిసి రోడ్డు పనులు ప్రారంభం

మల్లాపూర్ ప్రభాతవార్త



మల్లాపూర్ మండల కేంద్రం లో జువ్వాడి నరసింగరావు సహకారం తో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదురుగా మెయిన్ రోడ్డు నుండి దేవస్థానం మెట్ల వరకు ఐదు (5)లక్షల సీ.సీ రోడ్డు పనులు జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు మరియు మాజీ జడ్పి.టి.సి ఎల్లాల జలపతి రెడ్డి ప్రారంభించారు.మల్లాపూర్ లో సి.సి రోడ్లు మరియు డ్రైనేజీలకు 67 లక్షలు నిధులు మంజూరు చేయించిన జువ్వాడి నరసింగ రావు కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్,ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి,దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సంగ రాజం యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాట్ల సోమయ్య,వన సంరక్షణ సమితి మాజీ చైర్మన్ సిరిపురం రవీందర్,కోటగిరి ఆనంద్ గౌడ్,మరిపెల్లి మల్లయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం,ఎర్ర భూమయ్య,వెల్మల రాజిరెడ్డి,వార్డు సభ్యులు ముష్కరి రమేష్,కొంపెల్లి రాకేష్,అల్లె చంద్రయ్య,శనిగారపు నరేష్, కదుర్క రాజేందర్,మొరపు గంగా రాజం,మహమ్మద్ షబ్బీర్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మున్సిపాలిటీలో వర్షాకాలం వచ్చిందంటే మునిగే లోతట్టు ప్రాంతాలలో మొదటి వరుసలో ఉండే వార్డు 6వ వార్డు.అక్కడి కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ గౌడ్ వర్ష కాలం రాకముందే ముందస్తు చర్యలు చేపడుతూ ఉంటారు. ఇక్కడే ఆశ్చర్యం ఏమిటంటే ఆ వార్డు కౌన్సిలర్ సమస్యలు పరిష్కరించడానికి తనదంటూ ఒక ముద్ర వేసుకున్నారు. అదేంటి అంటే కార్మికులతో స్నేహం భావంతో మెదులుతూ వార్డులో తక్షణమే నిర్వర్తించే డ్రైనేజ్, రోడ్ల పరిశుభ్రతలో ముందుంటూ వారితో పనులు త్వరితగతిన పూర్తి చేస్తుంది. ఆ వార్డులలో పనిచేయాలంటే కార్మికులు సైతం సంతోషిస్తారు అంటే అతిశయోక్తి కాదు. అందుకు ముఖ్య కారణం కార్మికులతో కలిసి పని చేయించడం. ఈ విషయమై ఆమెను ప్రశ్నించగా నాకు ఈ వార్డులో సమస్య ఉంటే తక్షణమే పరిష్కరించాలని ఉంటుంది. ఎప్పుడు వార్డులలో ఉన్న సమస్యను అలసత్వం చేయకుండా వార్డు ప్రజలతో, వార్డులో పని చేసే కార్మికులతో స్నేహంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు సేవకురాలిగా పనిచేస్తానని ఆమె అన్నారు. ఇప్పుడు ఉన్న ఈ ఆధునిక సమాజంలో ఈ కౌన్సిలర్ మాదిరిగా నూతన పాలకవర్గం ఉందని ప్రజలు బాహాటంగా చెబుతున్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

.హాస్టల్,విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి.. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్..

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.

.మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.తంగళ్ళపల్లిలోని సిరిసిల్ల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా వారితో మాట్లాడారు. ఈరోజు ఏ ఏ ఆహార పదార్థాలు వడ్డించారో ఆరా తీశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించారు.ఎంతమంది విద్యార్థులు వచ్చారో ఆరా తీశారు. అనంతరం వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు



మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.విద్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బాలరాజ్ గౌడ్

గంభీరావుపేట, ప్రభాతవార్త:

రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు నాగపురి బాలరాజు గౌడ్ ఆరోపించారు. సోమవారము బిఆర్ఎస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం పని చేస్తున్నట్లు విమర్శించారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని మండి పడ్డారు. రైతుబంధు రెట్టింపు చేస్తామని. 35రకాల ధాన్యంను కొనుగోలు చేస్తామని, రకరకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఏఒక్కటీ అమల చేయకపోయి ఉన్న పథకాలను సైతం పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడేమో 7రకాల వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం రైతులను నిండా



ముంచడమేనన్నారు. రైతుల పథకాలను నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకొదని రైతుల పక్షాన ఆందోళనలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దమ్మన్నపేట, కోళ్ళమద్ది సర్పంచ్ లు దుంపల చంద్రశేఖర్‌రెడ్డి. ఎడబోయిన దిలీప కుమార్. ఉపసర్పంచ్ కమలాకర్ రెడ్డి, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, కమ్మరి రాజారాం, పెద్దవేని వెంకటి యాదవ్, ఈరవేని శివయ్య, చెరాల వేంకటస్వామిగౌడ్, నాగారపు దేవేందర్, వేముల బాల్‌రాజు, ద్యానబోయి రాజేందర్, ఎర్రం అంజిరెడ్డి. గంధ్యాడపు రాజు, అగ్గతి రాజు, శాత్రబోయిన లక్ష్మణ్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

జనగణన 2027 మొదటి దశలో రాష్ట్రంలో జిల్లాకు మొదటి స్థానం

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త



: జనగణన 2027 లో భాగంగా మొదటి దశ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించి రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జనగణన2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం 2026 మే 11న ప్రారంభమై జూన్ 9వ తేదీన ముగియగా, రాష్ట్రస్థాయిలో కచ్చితత్వ వివరాల నమోదు, ప్రక్రియ సరిగా పూర్తి చేయడం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల (డోర్స్) తరపున జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో డోర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అష్టల్ బేగం, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత డైరీల పంపిణీ

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలములోని కందికట్కూరులో జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం సోమవారం డైరీలను అందించారు.తల్లిదండ్రుల కోరిక మేరకు హోం వర్క్ చేయుటకు డైరీలు అందించిన్నట్లు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోజు ఇంటిపనిని డైరీలో నమోదు చేసుకుని ఇంటివద్ద పూర్తి చేయాలని సూచించారు. అంతే కాకుండా ప్రతి విద్యార్థి చదువుపై మక్కువ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.

.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తంగళ్ళపల్లి మండలం మండెపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరరావు,ఎస్సై ఉపేంద్ర చారి లు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితం,కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.విద్యార్థులు తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,పోలీసు సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన మేళ రైతులకు ఆహ్వానం

ముస్తాబాద్ ప్రభాత వార్త

:ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల23 నుండి 30 వరకు ముస్తాబాద్ మండల రైతు వేదికలో విత్తన మేళ నిర్వహిస్తామని మండల వ్యవసాయ అధికారి అనూష పత్రిక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయనీ,వీటిని కొనుగోలు చేసుకోవాలని అన్నారు.ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిరిసిల్ల వార్త

శాత్రాజుపల్లి గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల అర్జున్ ప్రభాతవార్త:

స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్.ఆర్. శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని అన్ని గ్రూపుల్లోనూ ప్రత్యేకంగా ఎస్సీ విద్యార్థినుల కోసం సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రవేశాలు పొందడానికి ఆసక్తి, అర్హత గల విద్యార్థినులు తమ విద్యాసంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను వెంట తెచ్చుకుని నేరుగా కళాశాల ప్రాంగణంలో సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాలు: నాణ్యమైన ఉచిత వసతి మరియు పౌష్టికాహారంతో కూడిన భోజన సదుపాయం. విద్యార్థినుల కోసం డిజిటల్ తరగతులు, ఆధునిక విద్యా సదుపాయాలు. భవిష్యత్తులో ఉద్యోగ సాధన కోసం వివిధ పోటీ పరీక్షలకు నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణ. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అర్హులైన ఎస్సీ విద్యార్థినులు ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శర్మ కోరారు.

నేరెళ్ల పీహెచ్ సీ ని సందర్శించిన డిప్యూటీ డీఎం హెచ్ ఓ..



తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.

.తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డియంహెచ్ఓ డాక్టర్ పవిత్ర సందర్శించి కేంద్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న మాతా శిశు సంక్షేమ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు,వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు,ఇతర సేవల పురోగతిని పరిశీలించారు.ఆరోగ్య కేంద్రంలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులు,నివేదికలను క్షుణ్ణంగా తనిఖీ చేసి వాటి నిర్వహణపై సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, సేవల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.ఈ సందర్శనలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో 23 ఫిర్యాదుల స్వీకరణ

సిల్ల టౌన్, ప్రభాతవార్త

: జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులను అదనపు ఎస్పీ చంద్రయ్య స్వీకరించారు.అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ బాధితుల సమస్యలను చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.



పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

-జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్-2026

ప్రారంబించిన ఎస్పి అశోక్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:





పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా 3వ పోలీస్ డ్యూటీ మీట్-2026 కార్యక్రమాన్ని ఎస్పీ అదనపు ఎస్పీ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు.పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అధికారులు,సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు.ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, , డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీసబోటేజ్ చెకింగ్, మరియు కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించ బడుతున్నాయని తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిప రమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్,సుధాకర్, కరుణాకర్,రవి,లక్ష్మీనారాయణ,కిరణ్ కుమార్,వేణు,ఎస్. ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజా గౌడ్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో



ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 113 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 182 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు , తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఉపసర్పంచుల వినతి

బీర్‌పూర్, ప్రభాత వార్త:

జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారిని బీర్‌పూర్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు దగ్గుల వీరేశం ఆధ్వర్యంలో మండల ప్రజాప్రతినిధులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటీవల ఉపసర్పంచుల చెక్ పవర్ రద్దు కాబోతుందంటూ సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రభుత్వం ఖండించి, దీనిపై స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తాలని, అలాగే ప్రజాసేవ చేస్తున్న ఉపసర్పంచులకు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, వారి న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు నారపాక రమేష్, తరాళ్ల మల్లేశం, జక్కుల నాగరాజ్, శీలం లింగన్న, ఎనగంటి జితేందర్, ఎనగంటి రమేష్, సంగ గంగన్న, చిక్రం అంజన్న, పట్టం స్వర్ణలత, బత్తుల పద్మ, సీతారాం మహేష్, మల్లేశం మరియు వివిధ గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.



కొడిమ్యాల అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు

కొడిమ్యాల, ప్రభాతవార్త: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల అభివృద్ధి కోసం స్థానిక చొప్పదండి నియోజ కవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసిన సంద ర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మండలంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం పట్ల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు మండల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్ రెడ్డి, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరి రాజేష్, కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, మాజీ కెడిసిబి డైరెక్టర్ గుడి మల్లికార్జున్ రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు చిలువేరి నారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అజయ్ గౌడ్, నాయకులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, ముత్యం రెడ్డి, కంబల్ల రాజమల్లు, అజయ్ రెడ్డి, నేరెళ్ళ మహేష్, పర్లపల్లి ప్రసాద్, సింగిరెడ్డి వినోద్ రెడ్డి, నజీర్, ప్రసాద్, మల్లారపు రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగిత్యాల వార్త



రైతుల చెంతకే వానాకాలం విత్తనాలు

నేడే 'విత్తన మేళా' .. ఎంఏఓ తిరుపతి

బీర్ పూర్ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి, కోల్వాయి క్లస్టర్ రైతువేదికలలో ఈరోజు (మంగళవారం) "విత్తన మేళా" నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎన్. తిరుపతి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వానాకాలం సాగు కోసం రైతులకు విత్తనాలను మరింత చెంతకు చేర్చాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో భాగంగా వానాకాలం సీజన్‌కు అనువైన, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న వివిధ రకాల వరి విత్తనాలు, కందులు, పెసర విత్తనాలతో పాటు నానో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ విత్తన మేళా ఏర్పాట్లలో భాగంగా మండల కేంద్రంలో విత్తన డీలర్లతో మండల వ్యవసాయ అధికారి శ్రీ ఎన్. తిరుపతి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లందరూ తమ వద్ద ఉన్న నాణ్యమైన వరి, కందులు, పెసర్లు మరియు ఇతర విత్తన నిల్వలను నేటి మేళాలో రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) అయ్యోరి వినోద్, వడ్లూరి శిరీష మరియు బీర్పూర్ మండల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవం

విద్యార్థుల వికాసానికి యోగా ఒక వరం

హెచ్ఎం జూపాక సుదర్శన్

బీర్‌పూర్, ప్రభాత వార్త

జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సోమవారం నాడు అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, చురుకుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని ఉద్ఘాటించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని, భావోద్వేగాలను అదుపు చేయడంలో యోగా అద్భుతంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. విద్యార్థుల్లో ప్రశాంతత, ఏకాగ్రత, మరియు జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి యోగా ఒక వరం లాంటిదని, దీనివల్ల సంపూర్ణ మూర్తిమత్వ వికాసం కలిగి అభ్యాస ప్రక్రియ మెరుగవుతుందని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం యోగా గురువు గంధం రమేష్ విద్యార్థులకు వివిధ రకాల ఆసనాలను ప్రత్యక్షంగా చేయిస్తూ వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.పాఠశాల విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, ఇలాంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ఇతర అంశాలలోనూ మంచి జ్ఞానాన్ని ప్రసాదిస్తూ, వారు ఉన్నత స్థాయిలో ఎదగడానికి నిరంతరం శ్రమిస్తున్న ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ కృషిని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈ విశేష కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ సముద్రాల శ్రీలత, ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి, భోగ నాగరాణి, బాణావత్ స్వరూప మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.





అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ జూనియర్ కాలేజెస్ ఫ్రెషర్స్ డే

కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:





విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయ కుండా కష్టపడి నెరవే ర్చాలని, ఇతరులకు ఆద ర్శంగా నిలవాలని చొప్ప దండి శాసనసభ్యుడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం కరీంనగర్ లో నిర్వహించిన వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..విద్యతో సమాజంలో చాలా గొప్ప గుర్తింపు పొందగలుగుతామని,సమయాన్ని వృధా చేయకుండా చదువులో పట్టు సాధించి అగ్రస్థానంలో నిలవాలని చెప్పారు. విద్యార్థులు ఎవరైతే అగ్రస్థానంలో ఉంటారో వారికి భవిష్యత్తులో అవకాశాలు చాలా పుష్కలంగా ఉంటాయని తెలిపారు. ఎంతోమంది ప్రముఖులు చదువుతో ఖ్యాతి చెందారని తెలిపారు..తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ప్రత్యేకంగా వారు విద్యారంగంపై దృష్టి సారించడం చాలా గొప్ప విషయమని చెప్పారు. విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల పాత్ర చాలా ప్రశంసనీయమైనదన్నారు. విద్యార్థులకు నమ్మశక్యము గానీ ఫలితాలను సాధించి దిక్సూచిగా నిలుస్తున్నదని కొనియాడారు. నరేందర్ రెడ్డి చేస్తున్నటువంటి కృషి చాలా ఆదర్శనీయమైనదని తెలిపారు.విద్యా విధానాలు చాలా చాలా గొప్పవాని కొనియాడారు.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు గత 36 సంవత్సరాలుగా తరగని ఉత్సాహంతో ఘన విజయాలే లక్ష్యంగా ముందుకు పయనిస్తూ సమాజంలో అగ్రస్థానంలో నిలుస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సైతం అధ్యాపకుల యొక్క సూచనలను పాటిస్తూ చాలా గొప్ప ఫలితాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. అదే విధంగా ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 109 మంది విద్యార్థులు భారతదేశ ప్రఖ్యాత ఐఐటీలలో, ఎన్ఐటీలలో, ఐఐఐటిలలో సీట్లను సాధించి నూతన చరిత్రకు బీజం వేశారని పేర్కొన్నారు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే కాకుండా వారిలో విశ్వాసం నింపతూ పలు పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం, విజయం సాధించడానికి ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతుందని చెప్పారు..వేడుకలలో భాగంగా ఐఐటీలలో, ఎన్ఐటీలలో ట్రిపుల్ ఐటీలలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు...

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర కీలకం

ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ప్రభాత వార్త:



ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్ఓ,సూపర్ వైజర్లకు నిర్వహించి అవగాహన శిబిరానికి ఆయన ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎంతో అవసరమని అన్నారు.ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు చేసుకోవడం ఎంత ముఖ్యమో, జాబితాలోని అర్హులైన వారి పేర్లు తొలగింపునకు గురి కాకుండా చూసుకోవడం అంతే ముఖ్యమన్నారు. కేంద్ర చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఓటర్ల పేర్లు జాబితా నుంచి అక్రమంగా తొలగింపునకు గురి కాకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండటం లేదా చిరునామా మార్పులు వంటి పొరపాట్లను వెంటనే సవరించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడూతూ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవడం, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. సర్ విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ శిబిరంలో తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి(తిమ్మాపూర్), ఇప్ప నరేందర్ (గన్నేరువరం), సురేష్ (ఇల్లంతకుంట), శ్రీకాంత్ (బెజ్జంకి), విజయ్ కుమార్ (మానకొండూర్), కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణితోపాటు పలువురు ఆర్ఐలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ

చిగురుమామిడి, ప్రభాత వార్త :





చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామంలోని హార్వెస్ట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో తొలి బ్యాచ్ పట్టాభిషేక కార్యక్రమం సోమవారం రోజున ఘనంగా జరిగింది. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా హార్వెస్ట్ మినిస్ట్రీస్ డైరెక్టర్ రాయపాటి కాలేబ్, శిక్షణ పొందిన మహిళలను అభినందించి, మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని, శిక్షణ పూర్తి చేసిన మహిళలు తమ కుటుంబానికి ఆర్థిక సహకారం అందించాలని వారు తెలియజేశారు. ముఖ్య అతిథులు గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ, కొమురయ్య మాట్లాడుతూ గ్రామీణ మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్వయం ఉపాధి దిశగా వారిని ప్రోత్సహిస్తునందుకు రాయపాటి కాలేబ్ కు కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు అన్ని విధాలుగా సహకారంగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉషా రాయపాటి, డా ఉమ, హార్వెస్ట్ మినిస్ట్రీస్ కోఆర్డినేటర్ శ్రీధర్, పాస్టర్ కొయ్యాడ అశీర్వాదం, గ్రామ ఉపసర్పంచ్ పైడిపెల్లి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ కయ్యం తిరుపతి తదితరులు పాల్గొని శిక్షణ పూర్తి చేసిన మహిళలను అభినందించారు. గ్రామీణ ప్రాంతం లో ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తూ, కుట్టు మిషన్ తో బాటు అర్హత సాధించిన సంస్థ అందించే సర్టిఫికెట్ ప్రధానం చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ హార్వెస్ట్ మినిస్ట్రీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కరీంనగర్ వార్త

నవాబుపేట పాల కేంద్రం అధ్యక్షులుగా ఐలేష్

చిగురుమామిడి, ప్రభాత వార్త :



చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామ పాల కేంద్రం (కరీంనగర్ డైరీ) నకు సంబంధించి ఆదివారం రోజున జరిగిన ఎన్నికల్లో భాగంగా నూతన అధ్యక్షులుగా మర్రి ఐలేష్, పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఇందులో నూతనంగా ఇద్దరిని పాలకవర్గ సభ్యులుగా మర్రి బాలయ్య, కూతురు రాజిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు డైరీ సూపర్వైజర్ సీత రవి తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఇట్టి సర్వసభ్య సమావేశం ఠాగూర్ నరేందర్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పోతర వేణి రాజయ్య, మంద రవీందర్, సంధి రాంరెడ్డి, గూళ్ల రవి, గూళ్ల నాగరాజు, ఇనుగాల నిరంజన్ రెడ్డి, పిల్లి ప్రశాంత్, డైరీ కార్యదర్శి కుంభం శ్రీనివాస్, పాలకేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగినది. పాలకేంద్రం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి డైరీ అధ్యక్షులుగా నన్ను ఎన్నుకున్న పాలకవర్గం సభ్యులకు మర్రి ఐలేష్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపై ఫ్లెక్సీతో బైఠాయించిన మహిళా సంఘ సభ్యులు

గ్రూప్ లీడర్, సీఏ మోసం చేశారు..నుస్తులాపూర్‌లో మహిళలు నిరసన

తిమ్మాపూర్,ప్రభాత వార్త :మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో తమ



గ్రూపులో తమకు తెలియకుండా రూ.పది లక్షలు లోన్ తీసుకొని గ్రూప్ లీడర్ సుమ, సీఏ రేణుక మోసగించారని, తమకు న్యాయం చేయాలంటూ గ్రూప్ సభ్యులు సోమవారం రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం తెలిపారు. మూడేళ్లుగా ఎన్ని కార్యాలయాలు తిరిగిన, ఎంతమంది అధికారులను కలిసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేసిన తప్పుకు తాము బలవుతున్నామని అన్నారు. ఈ స్కామ్ లో అధికారులు, బ్యాంకర్ల పాత్ర సైతం ఉన్నదని ఆరోపించారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

మందుబాబులకు అడ్డాలుగా సర్కార్ బడి

మానకొండూర్, ప్రభాతవార్త :



మానకొండూరు మండల కేంద్రంలోని సర్కార్ బడి మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు సోమవారం ఆరోపిస్తున్నారు. మానకొండూరు ప్రభుత్వ హైస్కూల్లో ప్రతిరోజు సాయంత్రం పాఠశాలలో మద్యం సేవిస్తూ, తాగిన బాటిళ్లను ధ్వంసం చేస్తు ఉదయాన్నే విద్యార్థులు పాఠశాలకు వచ్చేసరికి పాఠశాల వారండాలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని పిల్లల తల్లిదండ్రులు తెలిపారు. మందుబాబుల అడ్డాలతో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న వసతి గృహం లోని విద్యార్థులు పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక బ్లూ కోర్టు పోలీసుల పర్యవేక్షణ మరింతగా చేపట్టాలని, మత్తు పదార్థాలకు బానిసలైతున్న యువతను మంచి మార్గంలో పయనించేలా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్ఎంపీ,పీఎంపీ సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా పైడిపెల్లి భీమన్న ఘన విజయం

వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా... ..

నూతన ప్రధాన కార్యదర్శి భీమ

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త: కరీంనగర్ జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపీ వైద్యుడు పైడిపెల్లి భీమన్న ఎన్ని కయ్యారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లా సంఘం ఎన్నికల్లో భీమన్న ఘన విజయం సాధించి ప్రధాన కార్యదర్శి పదవిని దక్కించుకున్నారు. ఆయన విజయంతో జమ్మికుంట ప్రాంతానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు, అభిమానులు, సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఆర్ఎంపీ,పీఎంపీ సంఘం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించగా అధ్యక్ష పదవికి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శిగా పైడిపెల్లి భీమన్న, కోశాధికారిగా సంజీవ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి భీమన్న మాట్లాడుతూ జిల్లాలోని ఆర్ఎంపీ,పీఎంపీ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ వైద్యుల పాత్ర ఎంతో కీలకమైందని, వారి హక్కుల పరిరక్షణతో పాటు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకునేలా సంఘం తరఫున ప్రయత్నిస్తానని తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల వృత్తిపరమైన అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు, ప్రభుత్వ స్థాయిలో గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సంఘం ప్రత్యేక దృష్టి సారిస్తుందని భీమన్న తెలిపారు. జిల్లాలోని ప్రతి



వైద్యుడిని కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని, సభ్యులందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన విజయానికి సహకరించిన జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్యులు, సంఘ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ఓటు వేసి గెలిపించిన సభ్యులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేస్తానని చెప్పారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారులు మనోహర్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ మూర్తి, రవీందర్ రెడ్డి, శంకర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ రావు, సదానందం, జయమూర్తి, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. జిల్లా ఆర్ఎంపీ,పీఎంపీ సంఘం ఎన్నికల్లో పైడిపెల్లి భీమన్న విజయం సాధించడం జమ్మికుంట ప్రాంతానికి గర్వకారణమని పలువురు వైద్యులు, సంఘ సభ్యులు తెలిపారు.ఆయన నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం కావడంతో పాటు వైద్యుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు

ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కు ఫిర్యాదు ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్...



జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త: జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రైవేట్ పాఠశాలలో ఐఐటి మెడికల్ ఫౌండేషన్ కర్ర్యులం ఆక్టివిటీస్ పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి రక్తాన్ని జలగలా పిలుస్తున్నారని, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్న ఆలోచన విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయిందని, విద్యాదానం చేయాల్సి నటువంటి విద్యా సంస్థలు విద్యార్థుల పాలిట శాపంగా మారి వేలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారని నేడు ప్రైవేట్ విద్యా సంస్థలు డబ్బుల మీద ఉన్నటువంటి వ్యామోహం విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయిందని అన్నారు.ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల మార్కుల పాస్ పర్సంటేజ్ లో మాత్రం విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయి. అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్నటువంటి ఆలోచన విద్యార్థులు భవిష్యత్తు మీద ఉంటే బాగుంటుందని, విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించకుండా అధిక ఫీజుల దోపిడికి పాల్పడుతున్నటువంటి పలు ప్రైవేట్ పాఠశాలల పైన ఎంక్వయిరీ చేసి శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు గడ్డం సత్య విష్ణు, వరుణ్, కర్మల, సాయిచరణ్, సాయికుమార్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై చర్యలు తీసుకోవాలి : డీఎస్ఏ డిమాండ్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టాలని హితవు

కమలాపూర్: ప్రభాతవార్త.

కమలాపూర్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఫీజుల పేరుతో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆరోపించింది.సోమవారం కమలాపూర్ మండల కేంద్రంలో డీఎస్ఏ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు:ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చింది. కానీ రెండున్నరేళ్లు గడిచినా విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించలేదు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల క్లస్టర్లుగా మార్చాలనే నిర్ణయం విద్యా వ్యవస్థను దెబ్బతీస్తుంది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.కమలాపూర్ మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఫీజులు వసూలు చేస్తున్నాయని, పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీని బలవంతంగా అమ్ముతూ విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. షైర్ సేఫ్టీ, మోలిక వసతులు, ఆటస్థలం లేకున్నా కొన్ని పాఠశాలలు కొనసాగుతున్నాయని, లాభాలే ధ్యేయంగా వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు.ఈ అంశాలపై పలుమార్లు విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదని, పాఠశాలలను పరిశీలించేందుకు కూడా అధికారులు ముందుకు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ‘నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై స్థానిక ఎంఈఓ తక్షణం చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఎంఈఓ, డీఈఓ కార్యాలయాల ముందు భారీ ఆందోళన చేపడతాం" అని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా నాయకులు అఖిలేష్, నాగరాజు, జశ్వంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ వార్త

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండలము లో నీ మోడల్ స్కూల్,చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీ విద్యార్థులకు ముందస్తుగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ను పురస్కరించుకొని ,పోలీస్ కమిషనరేట్ ఆదేశానుసారం సోమవారం ఎస్సై ఆవుల తిరుపతి మాదక ద్రవ్యాల దుష్ప్ర భావాల పై అవగాహన కల్పించారు.మాదక ద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం ,సమాజం పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు.అంతే కాకుండా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా,వినియోగం,విక్రయాలపై సమాచార ముంటే పోలీస్ లకు తెలియజేయాలన్నారు.దీనికి ముందు మాదక ద్రవ్యాల నిర్మూల కు మాతో పాటు ఉపాధ్యాయులు ,విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ మొయిజ్ బేగ్, ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్ ఆచార్య తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్ కు కొండపాక గ్రామస్తుల వినతి

వీణవంక, ప్రభాత వార్త:



మండలములోని పోతిరెడ్డి పల్లి పేరుమీద కొనసాగుతున్న ఇసుక రీచ్ ను కొండపాకకు మార్చాలని కోరుతూ సోమవారం కొండపాక ఉప సర్పంచ్ పూరేళ్ళ కుమార్, వార్డు సభ్యులు దాట్ల శ్రీనివాస్, కత్తి సురేష్,కొలుగూరి రాజేష్, కె.తిరుపతి,నల్లగాశ కుమార స్వామి , కాసర్ల అనిల్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా కి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం లో కొండపాక రెవెన్యూ పరిధిలోని మానే రు వాగుపై కాంట్రాక్టర్ ఇసుక క్వారీ ఏర్పాటు చేసి ,పోతిరెడ్డి పల్లి పేరుమీద నడుపుతున్నారని,దీంతో మా గ్రామస్థ లము ఉపాధి కోల్పోతున్నామని,మా గ్రామం పేరుపై మార్చి న్యాయం చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా చాడ కొండాల్ రెడ్డి

సైదాపూర్, ప్రభాత వార్త:

సైదాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దుద్దనపల్లి గ్రామానికి చెందిన చాడ కొండాల్ రెడ్డి సోమవారం ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో మండల పార్టీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బాధ్యతా యుతంగా పనిచేస్తానని, తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు నూతన మండల అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు

కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే అరుణ శ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించి తప్పనిసరిగా సమాధానం అందించాలని స్పష్టం చేశారు. ఆర్‌టీఐ కింద వచ్చే దరఖాస్తులకు కూడా నిర్ణయిత సమయంలో సమాధానాలు ఇవ్వాలన్నారు. కొంతమంది ఫీల్డ్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఫీల్డ్ సిబ్బంది హాజరు, పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని శాఖాధిపతులను ఆదేశించారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని, కార్యాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. త్వరలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంపై సమీక్ష ఉంటుందని, అన్ని శాఖలు తమ నివేదికలను సమగ్రంగా సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరు సంవత్సరాలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదు

ప్రజావాణిలో ఓదెల మండలం రైతు తాటికొండ రమేష్ ఆవేదన

పెద్దపల్లి, ప్రభాతవార్త:



పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఓదెల మండలానికి చెందిన బాధితుడు తాటికొండ రమేష్ హాజరై తన ఆవేదనను వెళ్లగక్కారు. గత 6 సంవత్సరాలుగా కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎంఆర్వోలు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నప్పటికీ తనకు న్యాయం జరగలేదని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. తన పొలానికి వెళ్లే దారిని కల్పించాలని, భూమి వివాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వివాదాస్పద భూములను సీజ్ చేసి కోర్టుకు పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఓదెల గ్రామంలో తనకు సర్వే నంబర్ 943లో 1.05 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, అయితే చుట్టుపక్కల భూస్వాములు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ సర్వే ఆధారంగా భూమిని కొలిపించుకున్నప్పటికీ, సర్వే అధికారులు ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను కొందరు తొలగించారని పేర్కొన్నారు. సుమారు 7 గుంటల భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారని, దీనిపై కేసులు నమోదైనప్పటికీ ఇప్పటివరకు తనకు న్యాయం జరగలేదని వాపోయారు. తన పొలంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారని, వ్యవసాయ పనులకు వచ్చే కూలీలను కూడా బెదిరించి పంపిస్తున్నారని తెలిపారు. అలాగే రేవులకుంట చెరువును ఆక్రమించి బావులు తీయడం, డి86 కాలువను ధ్వంసం చేయడం వల్ల తమ భూమికి సాగునీరు అందకుండా పోయిందని ఆరోపించారు. 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో మరియు 2025 మార్చి, మే నెలల్లో కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు చేశానని, ఇటీవల 2026 జూన్ 18న ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ భూమి కొలతలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈజ్‌మెంట్ హక్కుల చట్టం ప్రకారం తమ పొలానికి రహదారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్

7వ వార్డులో విద్యుత్ స్తంభాలు, కొత్త మీటర్లు,నల్లా కనెక్షన్ల ఏర్పాటు

సుల్తానాబాద్,ప్రభాతవార్త:



సుల్తానాబాద్ పట్టణంలోని 7వ వార్డులో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వార్డ్ కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహాయ సహకారాలతో, మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, కమిషనర్ రమేష్ ఆదేశాల మేరకు వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కొత్త విద్యుత్ మీటర్ల కనెక్షన్లు, ప్రజల తాగునీటి అవసరాల కోసం నల్లా కనెక్షన్ల ఏర్పాటును పూర్తి చేసినట్లు తెలిపారు. గతంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు.ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఉట్ల వరప్రదీప్ తెలిపారు. వార్డు ప్రజలు అభివృద్ధి పనుల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏ ఈ. ఈశ్వర్ కి కౌన్సిలర్ వరప్రదీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఫోన్ అందజేత

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



మ్తుండలంలోని మంగపేట గ్రామానికి చెందిన కనిగంటి సాయికుమార్ అనే వ్యక్తి ఫోన్ పోగొట్టుకోవడం తో స్థానిక పోలీసు వారికి కంప్లైంట్ చేయగా పోలీసు వారు సిఈఐఆర్ పోర్టల్ లో వివరాలు నమోదు చేసి ఫోన్ ని గుర్తించి సోమవారం ఎస్సై వెంకటేష్ చేతుల మీదుగా బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఎవరైనా వారి యొక్క సెల్ ఫోన్నుపోగొట్టుకున్నా,దొంగతనానికి గురైనా అట్టి ఫోన్ వివరాలు సి ఈ ఐ ఆర్ లో నమోదు చేసుకోగలరని, ఈ పోర్టల్ ద్వారా మొబైల్ తిరిగి పొందే అవకాశం ఉందని ఇట్టి అవకాశం ని ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోగలరని మండల ప్రజలకు తెలిపారు. అదేవిధంగా ఎవరికైనా మొబైల్ ఫోన్స్,అనుమానిత వస్తువులు, లేదా ఇతర విలువైన వస్తువులు గాని దొరికినట్లైతే వాటిని సమీప పోలీస్ స్టేషన్లో అప్పగించాలని ఆయన కోరారు

కాట్నపల్లి రైతు వేదికలో నేడు విత్తన మేళా

సుల్తానాబాద్, ప్రభాతవార్త: మండలంలోని కాట్నపల్లి రైతు వేదికలో మంగళవారం విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ మేళాలో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు వరి విత్తన రకాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకునేందుకు ఈ మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతు వేదికలలో విత్తన మేళా

జూలపల్లి,ప్రభాతవార్త:తెలంగాణ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు తేదీ: 23.06.2026 నుండి 30.06.2026 వారం రోజుల పాటు జూలపల్లి మండలంలోని మూడు రైతువేదికలలో విత్తన మేళ నిర్వహించబడును. మొదటి రోజున అబ్బాపూర్ రైతువేదిక లో తేదీ 23.06.2026 అనగా మంగళవారం ఉదయం 9 గంటలకు విత్తన మేళా కలదు.ఇట్టి మేళాలో రైతులకు కావాల్సిన,ప్రభుత్వం ప్రకటించిన 07 వరి రకాలు,బోనస్ వచ్చేవి,నానో యూరియా నానో డీఏపీ అమ్మకానికి సిద్ధంగా ఉంటాయి. కావున రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారిని ప్రత్యూష ఒక ప్రకటనలో తెలియ జేశారు.



లోక్ అదాలత్‌లో మొత్తం 6,545 కేసుల పరిష్కారం

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం),

జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 6,545 కేసులు పరిష్కరించబడ్డాయని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో నమోదైన కేసుల్లో ఐపీసీ కేసులు 637, ఎసఎలఎల్ కేసులు 46, ఈపెట్టి కేసులు 3,097, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 2,809, విపత్తు నిర్వహణ చట్టం ఈపెట్టి కేసులు 2 పరిష్కారమయ్యాయి. అలాగే 76 సైబర్ నేర కేసుల్లో బాధితులకు రూ.27,35,072, సీసీపీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 7 కేసుల్లో రూ.46,32,647 చొప్పున మొత్తం 83 సైబర్ కేసుల్లో రూ.73,67,714 బాధితులకు తిరిగి అందజేశామన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా స్వల్ప చట్టపరమైన కేసులు వేగంగా పరిష్కారం కావడంతో ప్రజలకు సమయం, ధనం ఆదా అయ్యాయని పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధి కి సంపూర్ణ సహకారం

ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



మోట్లపల్లి గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు ..శివపల్లి లోని ఎమ్మెల్యే నివాసం లో మొట్లపల్లి గ్రామపంచాయతీ పాలక వర్గం ఆయనను సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు .గ్రామ సర్పంచ్ మనోహర్ రావు తో సహా పది మంది వార్డు సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు ..ఈ సందర్భంగా సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పాకల వర్గం ఐక్యంగా రావడం సంతోషంగా ఉందని అన్నారు ..మొట్లపల్లి గ్రామా అభివృద్ధికి నా సంపూర్ణ సహకారం ఉంటుందని అన్నారు ..నక్కల వాగు పై వంతెన నిర్మాణం తో పాటు మానేరు రోడ్డు , గారెల గడ్డ బై పాస్ రోడ్డు ను మెటల్ రోడ్డు కు ,సీసీ రోడ్లకు తగినన్నీ నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారుఈ కార్య క్రమం లో ఉపసర్పంచ్ బొమ్మెల సుమలత సదయ్య ,వార్డు సభ్యులు దొమ్మటి శంకరమ్మ చంద్రయ్య ,రామిదేని రాజేశం ,దొమ్మటి పోచాలు ,బెజ్జాల మానస రవి,గాదర్ల శారద మొండయ్య ,పోగుల రమేష్ ,అనుముల రమేష్ ,సముద్రాల వసంత రాజేశం ,బెజ్జాల సంపత్ , తదితరులు పాల్గొన్నారు .

సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేసిన సర్పంచ్

జూలపల్లి,ప్రభాతవార్త:జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో సోమవారం రోజున రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు వారి ఆదేశాల మేరకు 15 లక్షల ఎన్ఆర్జిఎస్ నిధులతో సిసి రోడ్డు పనులకు సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు ఘనంగా భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇట్టి నిధులు మంజూరు చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు మారం నాగరాజులావణ్య,చిప్ప అరుణ్ కుమార్,టేక్కం అరుణా రవి,బొడిగ లక్ష్మణ్,నిట్టు అంజయ్య,జన్నారం భాస్కర్ పద్మ,శేరి నర్సింగం,కొమ్మ రాజేశం,రామడుగు శంకరయ్య,కొమ్ముల నారాయణ,అరకోళ్ల సంపత్,అరకోళ్ళ కనకయ్య,పొన్నం లచ్చయ్య,అరకోళ్ల రామచంద్రం ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు... యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చొప్పదండి ఎస్సై నరేష్ రెడ్డి

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి పట్టణం లోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ లొ ఆంటీ డ్రగ్స్ అవర్ నెస్ వీక్ లో భాగంగా చొప్పదండి పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహవిద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ సోమవారం స్థానికంగా యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై నరేష్ రెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించారు.ఈ సందర్భంగా ఎస్సై నరేష్ రెడ్డి విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద మాదక ద్రవ్యాల కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్ రెడ్డి, కరస్పాండెంట్ రత్నాకర్, ప్రిన్సిపల్ వెంకటరమణ విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్ పై అవగాహన

గంగాధర, ప్రభాత వార్త :



మాదక ద్రవ్యాల నిర్మూలన,యువతలో అవగాహన పెంపొందించేందుకు ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మహాత్మా గాంధీ జ్యోతిబా ఫూలే బాలుర పాఠశాలలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ... విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించి, మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అవగాహన, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సామాజిక బాధ్యత, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దమ్మని రాము, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుండి లావని పట్టాదారులకు న్యాయం చేయాలి

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలం పోతారం గ్రామ శివారులోని దాదాపు 50 ఏళ్ల క్రితం ప్రభుత్వం ద్వారా సర్వేనెంబర్ 522 లో లావనీ పట్టాలు పొందిన తమ భూములు కొంతమంది ఆక్రమణకు గురిచేసి తమను భూముల వద్దకు రానివ్వడం లేదని పోతారం గ్రామానికి చెందిన అంబేద్కర్ మాదియువజన సంఘం ఆధ్వర్యంలో 24 మంది సోమవారం జగిత్యాల కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు, ఆట్టి లావని పట్టాల పై 100 మంది కుటుంబాల ఆధారపడి ఉన్నాయని, తమ భూముల ఆక్రములపై విచారణ జరిపి తమ భూముల హద్దులు చూపించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు, అంతేకాకుండా మల్యాల తహసిల్దార్ కు కూడా ఈ సందర్భంగా వారు వినతి పత్రం అందజేశారు,

సర్వాపూర్ లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన జిల్లా స్పెషల్ ఆఫీసర్

మల్యాల /ప్రభాతవార్త



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జగిత్యాల జిల్లా ప్రత్యేక అధికారి సిక్తా పట్నాయక్ సోమవారం మల్యాల మండలంలోని సర్వాపూర్ లో మాడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు, ఈ సందర్భంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇండ్లను, ప్రోగ్రెస్ లో ఉన్న వాటిని పరిశీలించి అధికారులు, సంబంధిత లబ్ధిదారులతో మాట్లాడారు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆర్డిఓ మధుసూదన్ తో పాటు జిల్లా హౌసింగ్ పీడీ,జిల్లా పంచాయతీ అధికారి, డి ఎల్ పి ఓ, మల్యాల తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో స్వాతి, సర్వాపూర్ సర్పంచ్ హనుమంతు పాల్గొన్నారు పాల్గొన్నారు

పొందని రుణంపై కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన రైతు

మల్యాల /ప్రభాతవార్త

మల్యాల వ్యవసాయ సహకార సంఘం లో తనకు తెలియకుండా,



అనుమతి లేకుండానే ఒక లక్ష రూపాయల రుణం తీసుకున్నట్లు లోన్ లెడ్జర్ ట్రాన్సాక్షన్ రిజిస్టర్ లో తప్పుగా చూపుతున్నారని మల్యాల మండల కేంద్రానికి చెందిన రైతు జనగాం రాములు సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్ కు ఫిర్యాదు చేశారు, ఈ మేర కు తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ కలెక్టర్ కు అందజేసిన వివరాలను వెల్లడించారు, తాను వాస్తవంగా గత సెప్టెంబర్ 2023 లో తన రుణపరిమితి 3 లక్షల కు గాను కేవలం ఒక లక్ష రూపాయలు మాత్రమే పంట రుణం తీసుకున్నానని తెలిపారు, అయితే 1నవంబర్ 2023 లో మరో లక్ష రుణం తీసుకున్నట్లు తప్పుగా స్టేట్మెంట్ లో పేర్కొన్నారని, ఈ అవకతవకల వల్ల తాను తీవ్ర మానసిక క్షోభకు గురయ్యానని, దీనిపై పూర్తి విచారణ జరిపి తన ఖాతాలో అదనంగా చూపిన రుణం తొలగించి రుణమాఫీ కి అర్హుడిగా గుర్తించి న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరినట్లు బాధిత రైతు రాములు విలేకరులకు తెలిపారు,

కోరుట్లలో పురాతన రహదారి కబ్జాపై ఆర్డీవో జీవాకర్ రెడ్డి కి పిర్యాదు

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్లలోని పురాతన రోడ్డు (పాత గుంలాపూర్ రోడ్డు) సాయిబాబా దేవాలయం వెనుక ఒరె కాలువను అనుకొని వున్న పాత హద్ది రాస్తా ప్రస్తుతం మారేమ్మ దేవాలయం రోడ్డును సర్వే నెంబర్ 742 కు చెందిన చింత వెంకట నర్సయ్య కుమారులు ప్రభుత్వ ఉద్యోగులు అయి ఉండి ప్రభుత్వ రోడ్డును చదును చేసి దానిలో కందకాలు తవ్వి ప్లాట్లుగా మార్చి అమ్మకానికి పెడుతున్నారని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో మాదిగ కుల సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేష్ తో కలిసి కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్ రెడ్డికి పిర్యాదు చేశారు. పట్టణంలోని అంబేద్కర్ రోడ్ నుండి వాగు మీదిగా మహాలక్షి ్మ దేవాలయం, మడేలయ్య, పెద్దమ్మ, మారేమ్మ దేవాలయాలకు వెళ్లే భక్తులతో పాటు రైతులు వాడుకునే రోడ్డును ఇష్టం వచ్చినట్టు రియల్టర్లతో కుమ్మక్కై ప్రభుత్వ ఉద్యోగులే ఈ తతంగం చేయడం రహదారి కబ్జాకు పాల్పడడం దుర్మార్గపు చర్యగా ఫిర్యాదు లో పేర్కొన్నారు. స్పందించిన ఆర్డీవో జీవాకర్ రెడ్డి రహదారి కబ్జా చేస్తున్న వారిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అనవాయితీ గా ప్రస్తుతం మహాలక్షి ్మ, పెద్దమ్మ, మారేమ్మ బోనాలు తీసే భక్తులకు ఇబ్బందులకు గురి కాకుండా వెంటనే రహదారి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయించాలని కోరుట్ల తహశీల్దార్ కు ఆదేశాలు జారీ చేశారు.



సిరులు కురిపిస్తున్న ఆయిల్ పామ్ పంట

జిల్లా మేనేజర్ రోహిత్

చొప్పదండి,ప్రభాతవార్త:

చొప్పదండి మండల కేంద్రంలో సోమ మల్లారెడ్డి అనే రైతు 8 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేయగా మొదటి కోతలోనే 6 మెట్రిక్ టన్నుల దిగుబడి వొచ్చిందని, ఆయిల్ పామ్ పంట లో దిగుబడి ప్రతీ నెలా వొచ్చుకుంటూ 30 సంవత్సరాల వరకు నిరంతరంగా వొస్తూనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఆయిల్ పామ్ పంట టన్ను ధర సగటున 24,000 రూపాయల వరకు ఉంది. అందుకే రైతు సోదరులు నష్టాలు, కష్టాలు లేని ఈ పంటను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ రోహిత్ కోరారు.

మంటలు అర్పించి...

భారీ ప్రమాదం తప్పించిన చైర్...వైస్ చైర్ పర్సన్ లు

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి పట్టణ కేంద్రంలోని కుడి చెరువు మత్తడి ప్రాంతంలో సోమవారం ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం చోటుచేసుకొని మంటలు వ్యాపిస్తున్న నేపథ్యంలో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న చైర్ పర్సన్ వడ్నూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరమాండ్ల మానస గంగయ్య గౌడ్ లు పరిస్థితిని పర్యవేక్షి ంచడం జరిగింది.అనంతరం ఫైర్ ఇంజన్ సర్వీస్‌కు సమాచారం అందించగా, సకాలంలో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చి పెద్ద ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు.ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సహాయక చర్యలు చేపట్టిన అగ్నిమాపక శాఖ సిబ్బందికి, సహకరించిన స్థానిక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్ పామ్ పంట తో అధిక దిగుబడులు

అధిక ఆదాయం ఉద్యాన అధికారి స్వాతి

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి మండలంలో ఉద్యాన శాఖ ద్వారా జనవరి, 2023 లో నాటిన ఆయిల్ పామ్ మొక్కల నుండి ప్రస్తుతం గెలల కోత ప్రారంభమైందని ఉద్యాన అధికారి కె స్వాతి తెలిపారు. చొప్పదండి మండల కేంద్రంలోని రైతు సోమ మల్లారెడ్డి 2023 లో నాటిన 8 ఎకరాల ఆయిల్ పామ్ తోట నుండి మొదటి కోతలోనే 6 టన్నుల దిగుబడి తీయడం జరిగిందని మండల ఉద్యాన అధికారి స్వాతి పేర్కొన్నారు.టన్నుకు 23582 రూపాయల చొప్పున 1,41,482 రూపాయలు మరో వారం రోజుల్లో రైతు ఖాతాలో నేరుగా ఆయిల్ ఫెడ్ ద్వారా జమచేయడం జరుగుతుందని ఉద్యాన అధికారి కె.స్వాతి పేర్కొన్నారు.ఆయిల్ పామ్ మొక్కలు 90 శాతం సబ్సిడీ పై ఒక మొక్కక 20 రూపాయలకే కె రైతుకు ఇవ్వడంతో పాటు 7090 శాతం సబ్సిడీ పై డ్రిప్ పరికరాలు, ఒక ఎకరానికి ఒక సంవత్సరానికి 4200 రూపాయల చొప్పున 4 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు రైతుల ఖాతాల్లో జమచేయబడటం జరుగుతుందన్నారు.కోతుల బెడదలేని, ప్రకృతి వైపరీత్యాలకు నష్టం వాటిల్లని, ఖచ్చితమైన మార్కెట్ వ్యవస్థ కలిగి , స్థిరమైన ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ పంట సాగు చేసి రైతులు అధిక ఆదాయాన్ని పొందగలరని, ఆసక్తి గల రైతులు వ్యవసాయ లేదా ఉద్యాన అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఉద్యాన శాఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని ఉద్యాన అధికారి స్వాతి తెలిపారు.

హన్మాజిపేటలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

వేములవాడ రూరల్ ప్రభాత వార్త

వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేట గ్రామం మూడో వార్డులో నెలకొన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను స్థానిక ప్రజలు వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు ఎమ్మెల్యే నిధుల నుంచి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేశారు.మంజూరైన నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు హన్మాజిపేట గ్రామ సర్పంచ్ జంకె మధు, ఉపసర్పంచ్ శంకరవ్వ తో పాటు పాలకవర్గ సభ్యులు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. గ్రామంలో ఎన్నాళ్లుగానో కొనసాగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుండటంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత



ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్రవంతి హరినందన్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిలుక ప్రభాకర్, గొర్రె మైసయ్య, దేవయ్య, సందేల సత్తయ్య, నాగరాజు, జంకె మహేష్ మరియు గ్రామ కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

ట్రక్ షీట్స్ ఇవ్వాలని లారీ యజమానులకు ఆదేశాలు

జిల్లా సివిల్ సప్లై మేనేజర్ నరసింహ

వార్త కథనానికి స్పందన

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

ధాన్యం విక్రయించిన రైతులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే రైతులు డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా సివిల్ సప్లై మేనేజర్ నరసింహ తెలిపారు. సోమవారం వార్త దినపత్రికలో ప్రచురితమైన ఖి మాయం ఖి అనే శీర్షిక ప్రచురితం కావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా సివిల్ సప్లై మేనేజర్ నరసింహ స్పందించారు. మండలంలోని సింగిల్ విండో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ట్రక్ సీట్లు రాలేదని తెలియడంతోనే విచారణ చేపట్టమన్నారు. కాగా పెద్దూరు వేరే హౌస్ మేనేజర్ విజయ్ కుమార్ ను సంప్రదించే లోపే పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసిందన్నారు. ట్రక్ సీట్ల విషయంపై కరీంనగర్ మేనేజర్ సంప్రదించగా త్వరలోనే కొత్త మేనేజర్ ను సిరిసిల్లకు పంపిస్తామని తెలిపాడని, బాధ్యతలు చేపట్టగానే ట్రక్ సీట్ల ఆధారంగా రైతులకు డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లారీల ఖిమాయంఖిపై పోలీసుల ఆరా

సింగిల్ విండో కేంద్రాల్లో సిబ్బందిని విచారించిన పోలీసులు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

మాయమైన మూడు లారీల ఘటనపై జిల్లా పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. పత్రికల్లో మూడు వడ్ల లారీలు ప్రచురితమైన కథనాలకు స్పందించిన జిల్లా పోలీసు అధికారులు కోనరావుపేట, కొలనూర్ సింగిల్ విండో కేంద్రాల్లో అధికారులను విచారించినట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై లారీ డ్రైవర్లను సైతం విచారించగా, తాము పెద్దూరు అపరెల్ పార్కులోనే ధాన్యంను అన్‌లోడ్ చేశామని తమ వద్ద అధారాలు ఉన్నట్లు తెలిపినట్లు సమాచారం. జిల్లా సివిల్ సప్లై అధికారులు సైతం మాయమైన మూడు లారీల ఘటనపై లోతుగా విచారణ చేసినట్లు రెండు మూడు రోజుల్లో లారీలను పట్టుకుని రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సిపిఐ సీనియర్ నాయకుడి మృతి బాధాకరం

సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కుందేల్ల వెంకటి అనే రైతు తన వ్యవసాయం పొలం వద్ద పనిచేస్తుండగా వడదెబ్బ తగిలి మృతి చెందడం అత్యంత బాధాకరమని సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు.మృతుడి కుటుంబాన్ని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పరామర్శించారు. సోమవారం రోజున బొమ్మనపల్లి లో కుందేళ్ళ వెంకటి మృతదేహంపై సిపిఐ నాయకులు ఎర్రజెండా కప్పి నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూకుందేల్ల వెంకటి నిబద్ధత గల కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త అని నిరంతరం పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే వాడని, పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తూ ఉండి క్రమశిక్షణకు కట్టుబడి ఉండే వ్యక్తి మృతి చెందడం చాలా బాధాకరమని,ఆయన మృతి పట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ పార్టీ అండగా ఉంటుందని లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మనపల్లి సిపిఐ గ్రామ కార్యదర్శి అందే సంపత్, ఉప సర్పంచ్ కాసర్ల హరీష్, సిపిఐ నాయకులు బండారు తిరుపతి,మొగిలి ఓదెలు, విలాసాగరం అంజయ్య,శ్రీనివాస్,వెంకటేష్, నరేష్ ,సిపిఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన..ఎస్సై ప్రశాంత్ రెడ్డి

ప్రభాత వార్త కోనరావుపేట



కోనరావుపేట మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ ప్రభుత్వ పాఠశాలలో కోనరావుపేట ఎస్సై కే. ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ వినియోగం కారణంగా జరుగుతున్న నేరాలు, యువతపై పడుతున్న ప్రతికూల ప్రభావాలు, ఆరోగ్య సమస్యలు మరియు భవిష్యత్తుపై కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు మరియు మంచి అలవాట్లపై దృష్టి సారించాలని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎప్ సెట్ కౌన్సిలింగ్

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ మండలం అగ్రహారంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎప్ సెట్ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు కౌన్సి లింగ్ నిర్వహించారు. తొలి రోజు 302 మంది అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయ్యిందని ప్రిన్సిపల్ పి.ప్రభాకర చారి తెలిపారు. ఈ కౌన్సి లింగ్ ఈ నెల 25 వరకు కొనసాగుతుందని, జిల్లాలో ఎప్ సెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకో వాలని కోరారు.

నేడు మర్రిగడ్డకు ప్రభుత్వ విప్

చందుర్తి / ప్రభాతవార్త

చందుర్తి మండలం మరిగడ్డ గ్రామానికి సోమవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విచ్చేస్తున్నట్లు చందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొట్టే ప్రభాకర్ తెలిపారు, రైతు వేదికలో విత్తనమేళ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

వేములవాడ వార్త

అసత్య ప్రచారాలతో ఆది శ్రీనివాస్‌ను అడ్డుకోలేరు

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై దుష్ప్రచారం కుట్రలను తిప్పికొడతాం

సోయినేని కర్ణాకర్

వేములవాడ రూరల్ ప్రభాత వార్త



రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న దుష్ప్రచారం వెనుక రాజకీయ ప్రత్యర్థుల కుట్ర ఉందని వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సోయినేని కర్ణాకర్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రజల్లో రోజురోజుకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.సామాన్య కుటుంబం నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆది శ్రీనివాస్ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. రాజకీయ వారసత్వం, ఆర్థిక బలం లేకుండానే ప్రజల ఆశీస్సులతో ఈ స్థాయికి చేరుకున్నారని అన్నారు.ఇటీవల వెలుగులోకి వచ్చిన ధాన్యం అక్రమ రవాణా కేసును ఆధారంగా చేసుకుని కొందరు కావాలనే ఎమ్మెల్యే పేరును వివాదంలోకి లాగేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యుడు కాంగ్రెస్ నాయకుడు కావడం తప్ప, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ రాజకీయ లబ్ధి కోసం కొందరు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చట్టం ముందు అందరూ సమానమేనని, ఎవరైనా తప్పు చేసి ఉంటే దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ తమ విధులు నిర్వర్తిస్తాయని, అయితే ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రజాప్రతినిధులను కేసులతో ముడిపెట్టడం రాజకీయ నీచ సంస్కృతికి నిదర్శనమని కర్ణాకర్ ధ్వజమెత్తారు.బీసీ వర్గాలకు చెందిన యువ నాయకుడిగా ఆది శ్రీనివాస్ సాధించిన రాజకీయ ప్రాధాన్యత కొందరికి అసహనంగా మారిందని, అందుకే తప్పుడు ప్రచారాలతో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి, ప్రజాసేవలతో ముందుకు సాగుతున్న తమ నాయకుడిపై జరుగుతున్న కుట్రలను ప్రజల సహకారంతో తిప్పికొడతామని స్పష్టం చేశారు.

విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభాత వార్త కోనరావుపేట



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను అందు బాటులోకి తీసుకురావడంతో పాటు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు జూన్ 23న కోనరావుపేట రైతువేదికలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు తెలిపారు. నాను ఎరువులు 7 రకాల సన్నపు విత్తనాలు అందిస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన సాగు వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు.

తిను బండరాలు నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ సురేష్

ప్రభాతవార్త కోనరావుపేట



తినుబండరాలు నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ సురేష్ అన్నారు సోమవారం కోనరావుపేట మండల కేంద్రం లోని పాణి పూరి బండి పై అమ్ముతున్న తిను బండారాలను ,పరిశీలించి, తనికి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యత లోపించిన వాటిని అమ్మితే కఠినచట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంథని వార్త

పట్టణ పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యత

బొక్కల వాగు కట్టపై సులబ్ టాయిలెట్ కాంప్లెక్స్ ప్రారంభం

మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్

మంథని ప్రభాతవార్త:



మంథని మున్సిపాల్ లో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం బోయింగ్ ఇండియా, సులబ్ ఇంటర్ నేషన్ సీత రామ సేవ సదన్ వారి సౌజన్యంతో బొక్కల వాగు కట్టపై నిర్మించిన ఆధునిక సులబ్ టాయిలెట్ కాంప్లెక్స్‌ను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన మోలిక సదుపాయాలు కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యమని అన్నారు.బొక్కల వాగు కట్ట ప్రాంతంలో ఉన్న మార్కెట్ వ్యాపారులు, స్థానిక ప్రజలు, సందర్శకులకు ఈ టాయిలెట్ కాంప్లెక్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక ప్రమాణాలతో ఈ మోడల్ సులబ్ టాయిలెట్ కాంప్లెక్స్‌ను నిర్మించినట్లు పేర్కొన్నారు. దీనిని వినియోగించే ప్రజలు కూడా పరిశుభ్రతను పాటిస్తూ నిర్వహణ సిబ్బందికి సహకరించాలని కోరారు.అలాగే గోదావరి నది వద్ద మరో నూతన సులబ్ టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లో కూడా ప్రజల సౌకర్యార్థం ఒక మోడల్ సులబ్ టాయిలెట్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, మంథని మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పోతరవేన శ్రీలత, లైశెట్టి రజిత, వేముల లక్ష్మి, యెల్లంకి వంశీధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మార్కెట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

టిపియూఎస్, జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య

రామగిరి ప్రభాతవార్త



తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టిపియుఎస్) ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాదులోని ఎల్బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో జరిగే తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని టీపియుఎస్ జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు అందజేసిన చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సదస్సుకు జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సింగరేణి, ఎన్‌టిపిసి, అల్ట్రాటెక్, ఆర్టీసీ, ఎన్పిడిసిఎల్, అన్ని జాతీయ బ్యాంకులు, ఎల్ఐసి తదితర పబ్లిక్ సెక్టార్ సంస్థలలో పనిచేస్తున్న పద్మశాలి ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సదస్సులో టిపియుఎస్ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ, పద్మశాలి ఉద్యోగుల సమస్యలు మొదలైన అంశాలను చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అసోసియేట్ ప్రెసిడెంట్ ఆంజనేయులు,ఉపాధ్యక్షులు తాటికొండ శంకర్, ప్రచార కార్యదర్శి పెండెం సత్యనారాయణ, ప్రాథమిక సభ్యులు ఆడెపు రవికుమార్, బండారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల సుధాకర్

రామగిరి ప్రభాతవార్త



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి అని కమాన్ పూర్ మండలం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల సుధాకర్ అన్నారు. సోమవారం(ప్రభుత్వ జూనియర్ కళాశాల(గుండారం)లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ మాట్లాడుతూ, నేటి యువత దేశ భవిష్యత్తు అని, విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో ఏకాగ్రతతో ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలు క్షణిక ఆనందాన్ని కలిగించినప్పటికీ, అవి వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువుపై ఆసక్తి తగ్గిపోతుందని, భవిష్యత్తు అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, క్రీడలు, పుస్తక పఠనం, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.కమాన్పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఖలీల్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకోవాలని, ఒత్తిడులు లేదా సమస్యలు ఎదురైనప్పుడు మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఖలీల్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుళ్లు దాసి సతీష్, శ్రీనాథ్, జాహ్నవి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుండి వారం రోజుల పాటు రైతు వేదికలలో విత్తన మేళా

మంథని వ్యవసాయ శాఖ ఏఓ డాక్టర్ నవ్య

మంథని ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నేటి నుండి 7రోజుల పాటు జిల్లాలోని రైతు వేదికలలో విత్తనమేళ నిర్వహించ బడుతుందని మంథని వ్యవసాయ శాఖ ఏఓ డాక్టర్ నవ్య తెలిపారు. ఈనెల 23నుండి 27 వరకు నిర్వహించే ఇట్టి మేళాలో రైతులకు కావాల్సిన ప్రభుత్వం ప్రకటించిన 7 వరి రకాలు, బోనస్ వచ్చేవి అమ్మకానికి సిద్ధంగా ఉంటాయన్నారు. అదేవిదంగా వరికి బదులుగా ఆరు తడి పంటలైన పెసర, మినుము, అలసంద, కంది, నువ్వులు, జొన్న, సజ్జలు మొదలగు పంటల విత్తనాలు లభ్యమవుతాయన్నారు.కావున రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవలని ఆమె సూచించారు.

మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడికి ఘన సన్మానం

రామగిరి ప్రభాతవార్త

కమాన్పూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ను పెంచికల్ పేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకం గా కలిసి పూలే బొకే అందించి శాలువ తో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నవేన వేణు, సాగర్ల కొండయ్య, వార్డు మెంబర్ దొంతుల అఖిల్, ఇరుగురాల లక్ష్మణ్, గోడిసెల రాజు, అన్నవేన స్వామి తదితరులు పాల్గొన్నారు.



మంథని డిపో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ పరిచయ కార్యక్రమం

మంథని రూరల్ ప్రభాతవార్త:



మంథని ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన డిపో కమిటీ సోమవారం డిఎం శ్రావణ్ కుమార్ ను కలిసి కార్మిక సమస్యల గురించి మాట్లాడారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కాళిదాసు, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి కొమ్మ కొమురయ్య ఆధ్వర్యంలో డిఎం తో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డిపో అభివృద్ధికి ఈ నూతన కమిటీ కలిసి పనిచేయాలని, నాయకుల పై మరింత బాధ్యత పెరిగింది అన్నారు.ఇట్టి కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ మంథని డిపో అధ్యక్షులు వై ఎస్ రెడ్డి,మంథని డిపో సెక్రటరీ గంధం రమేష్,డిపో చేర్మెన్ ఎం ఏ ఖాదర్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కూతుభోద్దీన్, వేల్పుల చంద్ర మోళి,మహేందర్, సత్యం,జి కె స్వామి, ఈ శ్రీనివాస్, జె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

రామగిరి ప్రభాతవార్త రామగిరి మండలం బుధవారం పేట గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మంగళవారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ కన్నూరి రవీందర్, ఉపసర్పంచ్ బుద్ధార్తి విజయ, డీసీసీ కార్యదర్శి బుద్ధార్తి బుచ్చన్న పటేల్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సహకారంతో ఈ శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

హైకోర్టు ఆదేశాలతో రెండవ కిస్తి కోసం సింగరేణి కమిటీ సమావేశం

మంథని ప్రభాతవార్త:



మంథని మండలం సింగరేణి ఓపెన్ కాస్ట్ విస్తీర్ణంలో భాగంగా గ్రామాలను కోల్పోయిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో భాగంగా రెండవ కిస్తీ పంపిణీ కోసం సింగరేణి సంస్థ రచ్చపల్లి, అక్కేపల్లి, లద్నాపూర్ గ్రామాల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసింది. సోమవారం కొత్తగూడెం సింగరేణి ఏస్టేట్ ఆఫీస్ లో లోకదాలత్ కమిటీ జిఎం లక్ష్మి పతి గౌడ్ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులు అడ్వాకెట్ ప్రజా ప్రతినిధులు. భూనిర్వాసితులతో హైకోర్టు ఆదేశాలతో సమావేశం ఏర్పాటు చేశారు.సింగరేణి కమిటీ సింగరేణి అడ్వాకెట్ అధికారులు పాల్గొని కోర్టు తీర్పు ప్రకారం స్టచ్చర్ (ఇండ్లకు) ఇంటి స్థలనికి 100 శాతం ఇవ్వాలని కోర్టు జర్జీ మెంట్ ఇవ్వగా ఇండ్లకు 15శాతం ఇంటి స్థలం 65 శాతం ఇస్తమని సింగరేణి కమిటీ తెలిపారు. కాగా మీటింగ్ లో కోర్టు తీర్పు ప్రకారం అడ్వాకెట్ నారాదాసు లక్ష్మణరావు స్టచ్చర్ (ఇండ్లకు) ఇంటి స్థలనికి 75శాతం ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో ఏ స్టేట్ జిఎం లక్ష్మిపతి గౌడ్, ఫైనాన్స్ జిఎం శ్రీనివాస్ఏ స్టేట్ అధికారులు హిర్య,కనవేన ఐలయ్య, లా ఆఫీసర్ వెంకట్ రావు, అశ్విని దత్, అంజయ్య.మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్. పెయ్యాలా గట్టయ్య.లబ్ధిదారులు సింగనవేన కుమార్.అసరి నాగరాజు.సింగనవేన మల్లేష్. కనవేన రాజు.మబ్బు శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి అబ్బాపూర్‌లో తీర్మానం

ప్రైవేట్ స్కూల్ బస్సులను వెనక్కి పంపిన గ్రామస్తులు

గొల్లపల్లి, ప్రభాతవార్త :





ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో గొల్లపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజల సమక్షంలో కీలక తీర్మానం చేసింది. తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నే చదివించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామానికి వచ్చిన ప్రైవేట్ పాఠశాలల బస్సులను గ్రామస్తులు వెనక్కి పంపించారు. అనంతరం తల్లిదండ్రుల అంగీకారంతో పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు, ఉత్తమ ఉపాధ్యాయులచే బోధన అందుతుందని తెలిపారు. ఆ దిశగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం గ్రామ ప్రజలందరి బాధ్యతగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.గత మూడు సంవత్సరాలుగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేక మూతపడిన పరిస్థితి నెలకొనగా, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజల సహకారంతో ఇటీవల పాఠశాలను పునఃప్రారంభించారు. ఇప్పుడు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు చేర్పిస్తూ గ్రామంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందని, అవసరమైన మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నామని గ్రామపంచాయతీ పాలకవర్గం స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి గ్రామపంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఎడమల మల్లారెడ్డి జ్ఞాపకార్థం బహుమతుల అందజేత

గొల్లపల్లి, ప్రభాతవార్త :



ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎడమల మల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బోజేందర్ రెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విద్యలో రాణించిన విద్యార్థులను సన్మానిస్తూ వారి ప్రతిభను అభినందించారు. మండల వ్యాప్తంగా ప్రథమ స్థానం సాధించిన చిర్ర వైష్ణవికి రూ.15 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన బండారు కీర్తికి రూ.10 వేలు, తృతీయ స్థానం సాధించిన రంగు రసజ్ఞకు రూ.5 వేల ప్రోత్సాహక బహుమతులను మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అందజేశారు.అలాగే మల్లన్నపేట ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన పడాల ఆక్షయకు రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన మామిడిపల్లి సాహిత్యకు రూ.5 వేల నగదు బహుమతులను మల్లన్నపేట, శంకర్రావుపేట, వెంగలాపూర్ సర్పంచులు సిద్ధెంకి లక్ష్మీ మల్లారెడ్డి, గోలి గంగారెడ్డి, రామ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా భోజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని ఈ సంవత్సరం కూడా ప్రోత్సాహక బహుమతలను అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు అవారి చందు, శంకర్రావుపేట ఉపసర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి, గోలి రమేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుంకరి రవి, కళ్లెం కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

సారంగాపూర్ ప్రభాత వార్త

సారంగాపూర్ మండల పరిధిలోని అర్పపల్లి గ్రామంలో సోమవారం జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ గారు విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులతో పాటు స్థానిక శుభకార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందులో భాగంగానే అర్పపల్లి గ్రామంలో రూ. 19 లక్షల ఈజీఎస్ ఈజీ ఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఆయన శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామానికి చెందిన తోట పుల్లవ్వరాజేశం దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ మహోత్సవానికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెడుతున్న ఆ కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు తన చేతుల మీదుగా చీరను కానుకగా అందజేసారు .ఈ కార్యక్రమం లో ఈ పర్యటనలో అర్పపల్లి గ్రామ సర్పంచ్ సొల్లు సురేందర్, ఉప సర్పంచ్ కొండా మురళి, ఎంపీడీఓ నీరజ, ఎంపీఓ సలీం, పాక్స్ చైర్మన్ మల్లారెడ్డి, మండల వార్డు సభ్యుల ఫోరం ప్రతినిధి నాంపల్లి, ముఖ్య నాయకులు రాజేందర్ రెడ్డి, కోల శ్రీనివాస్, మనోహర్ రెడ్డి, స్థానిక వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు యువత పాల్గొన్నారు.

ఆర్జీ2 ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ రెడ్డి

గోదావరిఖని, ప్రభాతవార్త:



ఆర్జీ2 ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్‌గా కొత్త సత్యనారాయణ రెడ్డిని నియమించారు. స్థానిక జనక్ భవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సంస్థ బలోపేతం కోసం సత్యనారాయణ రెడ్డి సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడతారని తెలిపారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డాక్టర్ బి. జనక్ ప్రసాద్‌తో పాటు సంస్థ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, ఐఎన్‌టీయూసీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షులు సదానందం, దాస్, ప్రధాన కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్, ప్రధాన వ్యవస్థాపక కార్యదర్శి నరేందర్, మందమర్రి ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం కృష్ణ, కార్యదర్శి నవీన్‌తో పాటు కేంద్ర శాఖ నాయకులు పాల్గొన్నారు.ఈనాడు శైలిలో సంక్షిప్తంగా, పూర్తిగా తెలుగులో రూపొందించాను.



ధర్మపురి వార్త

నేటి నుండి ఈ నెల 30 వరకు విత్తన మేళా

ధర్మపురి, ప్రభాతవార్త.

ధర్మపురి మండల కేంద్రంతో పాటు మండలంలోని తిమ్మాపూర్ రైతువేదికలో నేటి నుండి ఈనెల 30 వరకు విత్తన మేళా నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రాజ కుమార్ సోమవారం ఒక ప్రకటన తెలిపారు. ఇట్టి మేళాలో ప్రభుత్వం సాగుకు కోసం సూచించిన బీపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048 , హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, కె ఎన్ ఎం 1638,7715 రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కందులు పెసర్లు, మినుములు,కూరగాయల విత్తనాలు విక్రయాల జరుగుతాయని, నానో యూరియా, నానో డీఏపీ ఉత్పత్తులు సైతం అందుబాటులో ఉంటాయని, ఇట్టి విత్తనం మేళాను రైతులు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ నూతన గృహప్రవేశం

ధర్మపురి,ప్రభాతవార్త.



ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో ఈదునూరి లలిత, రాజయ్య దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ నూతన గృహాన్ని సర్పంచ్ ల మండల ఫోరం అధ్యక్షులు కాసారపు బాలగౌడ్ సోమవారం ప్రారంభించగా, లబ్ధిదారులు నూతన గృహంలోకి ప్రవేశించారు.ఈ సందర్భంగా బాలగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లతో గూడు లేని నిరుపేదలకు సొంత ఇల్లు కల నెరవేరుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసారపు కొమురయ్య, ధర్మపురి సహకార సంఘం ఉపాధ్యక్షులు షేర్ల రాజేశం,వార్డు సభ్యులు రాకేష్,పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై అసత్య ఆరోపణలు సరికావు

మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి



చందుర్తి / ప్రభాతవార్త వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను రాజకీయంగా ఎదుర్కోలేక అనవసరపు ఆరోపణ చేస్తున్నారని, ఎమ్మెల్యే పై అనవసరపు ఆరోపణలు సరికావని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకలు తిరుపతి అన్నారు, సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను రాజకీయంగా ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీలు ఆరోపణ చేస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ అసెంబ్లీలో ఎన్నికైన ఏకైక మున్నూరు కాపు ఎమ్మెల్యే ఆది అని గుర్తు చేశారు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న అసత్య ప్రచారం అత్యంత దారుణమని,ప్రజల విశ్వాసాన్ని, రాజకీయ ప్రత్యర్థుల గౌరవాన్ని సైతం సంపాదించుకున్న నాయకుడిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం కొందరి రాజకీయ దివాళా తనానికి నిదర్శనం అన్నారు,ఆది శ్రీనివాస్ రాజకీయంగా ఎదిగింది వారసత్వం వల్ల కాదని . డబ్బు, అధికారం అండతో కాదు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అన్నారు,కష్టపడి, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల కోసం పోరాడుతూ తన నిజాయితీ, నిబద్ధతతో ఈ స్థాయికి చేరుకున్నారన్నారు,బీసీ వర్గాలకు చెందిన నాయకుడిగా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని .ఇటీవల ధాన్యం అక్రమ రవాణా కేసు నేపథ్యంలో కొందరు ఉద్దేశపూర్వకంగా ఆది శ్రీనివాస్ పేరును లాగేందుకు ప్రయత్నించడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు , ఒక కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి సోదరుడు కాంగ్రెస్ నాయకుడు అనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వ విప్‌ను ఆ కేసుతో ముడిపెట్టడం వాస్తవాలను వక్రీకరించడం మాత్రమే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చట్టం ముందు ఎవరూ అతీతులు కారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు,

మార్కెట్లో నకిలీ విత్తనాల అమ్మకాలపై గట్టి నిఘా ఉంచాలి

ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



మార్కెట్లో నకిలీ విత్తనాల అమ్మకాలపై గట్టి నిఘా ఉంచాలి అని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తెలిపారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో, జిల్లా సహకార అధికారి, ప్రాథమిక సహకార సంఘాల కార్యదర్శులతో వానాకాలం సీజన్ పట్ల ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గంలో అవసరమైన కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వానకాలంలో ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పెద్దపల్లి ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నూతనంగా నిర్మాణం చేపడుతున్న బైపాస్ రోడ్డులో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిని సురక్షితమైన ప్రదేశాల్లోకి మార్చాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వానాకాలం సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించి రైతన్నలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మార్కెట్లో నకిలీ విత్తనాలపై నిఘా ఉంచి వాటి అమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఏ ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాల బారిన పడకుండా చూసుకోవాలని ఆదేశించారు. విత్తనాలు నిబంధనలకు అనుగుణంగా సజావుగా అమ్మకాలు సాగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులు కేంద్రాల వద్ద ఇబ్బంది పడకుండా డిజిటల్ ఎంట్రీలు, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా సహకార అధికారి శ్రీమాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, విద్యుత్ శాఖ ఎస్ ఈ గంగాధర్, డీఈ రాజబ్రహ్మచారి, ఏఈలు, ఏడీఈలు, పాక్స్ కార్యదర్శులు పాల్గొన్నారు.

హరితహారంతో ప్రకృతికి భరోసా

సింగరేణి పర్యటనలో ఎస్ఏటీజీ ఎండీ సోనీ బాలా దేవి పిలుపు

గోదావరిఖని, ప్రభాతవార్త:



తెలంగాణలో క్రీడా సంస్కృతిని గ్రామీణ స్థాయి వరకు విస్తరించడంతో పాటు యువతలో ఆరోగ్యవంతమైన జీవనశైలిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏటీజీ) వైస్ చైర్పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్, యువజన సేవల కమిషనర్ అకోయిజం సోనీ బాలా దేవి, ఐఎఫ్ఎస్ పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ప్రాంతాన్ని సందర్శించిన ఆమె క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాశాఖ అధికారులతో సమావేశమై క్రీడల విస్తరణ, ప్రతిభావంతులైన క్రీడాకారుల తయారీపై సమీక్ష నిర్వహించారు.గ్రామాలు, పట్టణాలు, పారిశ్రామిక ప్రాంతాల్లోని యువతకు క్రీడలను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. క్రీడా మౌలిక సదుపాయాల వినియోగం పెంచుతూ, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే రాష్ట్రం నుంచి మరింత మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం, క్రీడా సంఘాలు, శిక్షకులు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం రామగుండంలోని సింగరేణి అతిథి గృహ ప్రాంగణంలో పారిజాత మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ పట్ల తన నిబద్ధతను చాటారు. సింగరేణి అటవీ విభాగం చేపడుతున్న హరితహారం కార్యక్రమాలు, పచ్చదనం విస్తరణకు తీసుకుంటున్న చర్యలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.క్రీడలు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా సమాజ నిర్మాణానికి కూడా దోహదపడతాయని, అదే విధంగా పర్యావరణ పరిరక్షణ భావితరాల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు. యువత క్రీడలను జీవనశైలిలో భాగం చేసుకోవడంతో పాటు ప్రకృతి పరిరక్షణలోనూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్జీ1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (అటవీ) భానోత్ కర్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా నైపుణ్యం సామర్థం మెరుగుపడతాయి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

కమిషనరేట్‌లో మూడవ పోలీస్ డ్యూటీ మీట్ 2026 కార్యక్రమం

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:





రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందిలో వృత్తి పరమైన పనితీరును మెరుగు పరిచేందుకు మరియు శాస్త్రీయ దర్యాప్తు రంగంలో సరికొత్త సాంకేతిక మెళకువలను పెంపొందించేందుకు పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో దోహదపడుతుందని రామ గుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. గౌరవ డీజీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన పోలీసులకు సోమవారం కమిషనరేట్ స్థాయి మూడవ పోలీస్ డ్యూటీ మీట్2026 కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన అధికారులు, సిబ్బందికి కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, పేలుడు పదార్థాల గుర్తింపు, యాంటీసబోటేజ్ తనిఖీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశమూ ఉంటుందని వివరిం చారు. శాస్త్రీయ దర్యాప్తు, వేలిముద్రల విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, కేసుల దర్యాప్తులో మెళకువలను నేర్చుకోవడానికి, పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సంక్లిష్టమైన కేసుల పరిష్కారానికి అవసరమైన ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి, వృత్తిపరమైన పనితీరు, సామర్థ్యాలను మెరుగుపర చుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి జోన్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోలీస్ డ్యూటీ మీట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుందని, దీనివల్ల విభిన్న ప్రాంతాల పోలీసు అధికారియోంల మధ్య పరస్పర సహకారం, ప్రోత్సాహం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఇక్కడ ఎంపికై కాళేశ్వరం జోన్ తరఫున, రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి రామగుండం కమిషనరేట్‌కు, కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్, ఏఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ ఐలు, సీఐలు, ఎస్ ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకు చిత్రం...



రేక్కడితే గానీ డొక్కాడని దయనీయ పరిస్థితి... కరీంనగర్ పాత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో ఒక తల్లి కూలి పనులు చేస్తుంటే, ఆమెకు దగ్గరగా ఉన్న ఆ చిన్నారుల వెతలు ప్రతి ఒక్కరినీ కలచి వేస్తున్నాయి... చదువుకోవాల్సిన వయసులో, నిర్మాణ స్థలంలోని దుమ్ము, ధూళిలో చిన్నారి కాలాన్ని గడుపుతున్న ఆ పసి హృదయాల బతుకు చిత్రం అభివృద్ధికి ఆవల ఉన్న మరో వాస్తవం...

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త

ప్రతి శాఖ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల జిల్లాలో ప్రతి శాఖ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించు కోవాలని, ఎవరైనా జిల్లా అధికారి వారి లక్ష్యాలను నిరక్ష్యం చేస్తే ఆ జిల్లా అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలం గాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ రేట్ సమావేశం మందిరంలో సోమవా రం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి జిల్లా అధికారులతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతి పై ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమాలపై నివేదికలను సమర్పించారు.ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ మాట్లా డుతూ గ్రామ సభలు, వార్డు సభల ద్వారా ప్రజల నుంచి అందిన దరఖా స్తుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తించిన వినూత్న కార్యక్రమాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్, సి.పి.వో సత్యం , జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి, డి.ఆర్.డి.వో రఘువరన్, జిల్లా వైద్య శాఖ అధికారిణి సుజాత,డి.పి.వో మదన్ మోహన్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భాస్కర్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ఎక్కడా పెండింగ్ లో ఉంచకుండా చూడాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డీఆరఓ రాజేశ్వరిలతో కలిసి ఆయన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ప్రాథమిక పాఠశాలను పునః ప్రారంభించిన విద్యాధికారి,సర్పంచ్.

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండలము లో నీ లస్మక్కపల్లి ప్రభుత్వ పాఠశాలను సోమవారం గ్రామ సర్పంచ్ గెల్లు శ్రీనివాస్, మండల విద్యాధికారి ఎస్ శోభా రాణి లు పున: ప్రారంభించారు. గత 15 సంవత్సరాల క్రితం విద్యార్థుల పూర్తిగా పడిపోవడంతో పాఠశాలను మూసివేశారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల ఫీజులు అధికావడముతో పేద,మధ్య తరగతి వాళ్లు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని ,వారి కోరిక మేరకు 15 మంది విద్యార్థుల పేర్లు,ఆ పాట శా లలో నమోదు కావడంతో,మాకు తప్పకుండా పాఠశాలను తెరిపించాలని,రాష్ట్ర మంత్రి పొన్నం, నియోజక వర్గం ఇంచార్జి ప్రణవ్ ల ఆదేశాలతో ఈ పాఠశాలను పునః ప్రారంభించి నట్లు సర్పంచ్ వివరించారు.దీనికి సహకరించిన గ్రామ పాలక వర్గం సభ్యులు,మండల ప్రజా ప్రతినిధులకు,విద్యార్థులకు సర్పంచ్ అభినందనలు తెలియజేశాడు.ఈ కార్యక్రమములో గ్రామ ఉప సర్పంచ్ దాసారపు శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్కేటి రఘుపాల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సాహెబ్ హుస్సేన్,గ్రామ వార్డు సభ్యులు,ఉపాధ్యాయులు. పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం డబ్బులు, రైతు భరోసా నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి



ఇల్లంతకుంట, ప్రభాతవార్త : రైతులకు ధాన్యం విక్రయించిన బకాయిలు, రైతు భరోసా నిధులను సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం పార్టీ ఇల్లంతకుంట మండల కార్యదర్శి చెల్పూరి రాము విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన సమయంలో రైతులకు అత్యవసరంగా అవసరమైన ఆర్థిక సహాయం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే ధాన్యం విక్రయించిన రైతులు చెల్లింపుల కోసం ఎదురుచూస్తుండగా, రైతు భరోసా నిధులు కూడా ఖాతాల్లో జమ కాకపోవడం వల్ల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారని, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే వ్యవసాయం ముందుకు సాగేదెలా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యం బకాయిలు, రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరిని విడనాడి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర రజక కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ను సన్మానించిన దేశిని కోటి

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

తెలంగాణ రాష్ట్ర రజక (వాషర్మెన్) కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దాసరిరాజు అజయ్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశిని కోటి సోమవారం హైదరాబాదులోని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి,టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ ,తడక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మత్తు మందు... మరణానికి దారి...!

-- ఏసిపి వాసంశెట్టి మాధవి



జమ్మికుంటహుజురాబాద్, ప్రభాత వార్త: విద్యార్థులు మత్తుమందు సేవిస్తే మరణానికి దారితీస్తుందని హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి అన్నారు. సోమవారం హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని చదివిస్తారని, వారి ఆశయాలకు అనుగుణంగా చదివి ప్రయోజకులు కావాలని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఒక గొప్ప ఆశయాన్ని ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా చదవాలని అన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని, విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల వద్ద, పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు వాడకం కనిపిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుకు దగ్గరగా ఉంటే వృద్ధిలోకి వస్తారని అన్నారు. అనంతరం టౌన్ సిఐ కరుణాకర్ మాట్లాడుతూ విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలలో మత్తు పదార్థాలు, సిగరెట్లు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ తులసి దాస్, విజయేందర్ రెడ్డి, మురళీ మోహన్, వాసుదేవ రావు, రాజేశం, రాజశేఖర్, మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక వ్యక్తికి ఒకటే ఓటు... నకిలీలకు చెక్ పెట్టండి

-- బిఎల్ఓలకు ఆర్డీఓ దిశానిర్దేశం



జమ్మికుంటహుజురాబాద్, ప్రభాత వార్త: ప్రజాస్వామ్యానికి పునాది ఓటు... ఆ ఓటు హక్కును అర్హులకు అందించే వారధి బిఎల్ఓలు అని హుజురాబాద్ ఆర్డీఓ నాయక్‌వాడి జలకుమారి ఉద్ఘాటించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆమె బిఎల్ఓలకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 25వ తేది నుంచి ప్రతి బిఎల్ఓ తమకు కేటాయించిన బూత్‌లలో క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లను, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి జాబితా నుంచి ఏరివేయాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా చూడడంలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని ఆమె పిలుపునిచ్చారు. మ్యాపింగ్ తదితర సాంకేతిక అంశాలపై సందేహాలుంటే డిఎల్ఎంటీలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో తహశీల్దార్ జక్కని నరేందర్, డీఎల్ఎంటీ మాధవరావు, ఆర్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులపై దృష్టి

-- హుజురాబాద్‌లో ట్రైనీ కలెక్టర్ పర్యటన

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్ సోమవారం హుజురాబాద్ తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించిన ఆయన, ఫైళ్ల నిర్వహణను నిశితంగా గమనించారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన ఆర్ఓఆర్ పనుల పురోగతిపై తహశీల్దార్ జక్కని నరేందర్‌తో ప్రత్యేకంగా చర్చించారు. పనుల వేగం పెంచాలని సూచించిన ఈ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ నవ్య, ఇతర కార్యాలయ సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు.

విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్ మెమోరియల్ అవార్డు అందుకున్న ప్రముఖ వాగ్గేయకారుడు రామంచ భరత్

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా ప్రవీణ్ సల్వాజీ గ్రూప్ వారి ఆధ్వర్యంలో కరీంనగర్ కళాభారతి లో నిర్వహించిన వరల్డ్ మ్యూజిక్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ప్రముఖ విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్ మెమోరియల్ అవార్డును, కళారంగంలో అనేక సామాజిక సాంస్కృతిక విప్లవోద్యమాల్లో తన రచనలతో తన మధురమైన గానంతో సుధీర్ఘంగా 30 సంవత్సరాలుగా ప్రజలను చైత్నన్య వైపు నడిపిస్తూ, తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జ కట్టి గోసి గొంగడేసి పల్లె పల్లె తిరిగి లక్షలాది కోట్లాది మంది ప్రజలను యుద్ధం వైపు నడిపించి రాష్ట్రం సిద్ధించే వరకు అలుపెరుగని పోరాటం చేసి, కళా రంగంలో అశేషమైన కృషి చేసినందుకు గాను ప్రముఖ వాగ్గేయకారుడు రామంచ భరత్ కు ఈ అవార్డును అందజేశారు.సకల కలల సాంస్కృతిక సంఘం, ప్రవీణ్ శివాజీ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్, వాగ్గేయకరుడు తెల్లం మురళీ మధు, మ్యూజిక్ డైరెక్టర్ జియల్ నాందేవ్ నిర్వాహకులు ప్రవీణ్ సల్వాజి ల చేతుల మీదుగా విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్ మెమోరియల్ అవార్డును అందుకున్నందుకు గర్వకారణంగా ఉందని ఈ అవార్డును నాకు అందించిన సకల కలల సాంస్కృతిక సంఘం, ప్రవీణ్ సల్వాజీ గ్రూపు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి. ఫౌండర్, చైర్మన్ రామంచ భరత్ తెలిపారు.

బిఎల్ఓ,సూపర్వైజర్లకు సర్ శిక్షణ...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బిఎల్ఓ లకు,సూపర్వైజర్లకు సర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఇంచార్జి తహశీల్దార్ రాజమల్లు గిర్దావర్ గడ్డం శంకరయ్య, రెవెన్యూ సిబ్బంది,బిఎల్ఓ లు,సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులకు చరమగీతం పాడిన మడిపల్లి గ్రామ పాలకవర్గం....

.పాలకవర్గానికి హాట్సాఫ్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త: జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను రద్దు చేస్తూ తీర్మానం చేశారు. గ్రామంలో విచ్చల విడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తుండ డంతో మద్యం ప్రియు లకు అందుబాటులో మద్యం లభించడంతో యువత మద్యానికి అలవాటు పడి తమ జీవితాలను పాడు చేసుకోవడంతో బెల్ట్ షాపులను రద్దుచేసి గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చి దిద్దాలనే ఉద్దేశంతో పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.బెల్ట్ షాపులతోపాటు కిర్నాణ షాపులలో సైతం మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.ఈ సాహసోపేతమైన నిర్ణయంతో బెల్ట్ షాపులలో కిరాణం షాపులలో అమ్ముతున్న మద్యం అమ్మకాలకు చెక్ పడనుంది. జూలై 1వ తేదీ నుండి పూర్తిగా బెల్ట్ షాపులు నిషేధిస్తున్నట్లు పాలకవర్గం తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని ఉల్లంఘించి మద్యం అమ్మకాలు కొనసాగించిన వ్యక్తులకు రూ 10,000 జరిమానా విధించనున్నట్లు,ఎవరైనా రహస్యంగా బెల్ట్ షాపుల్లో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందించిన వ్యక్తులకు రూ 2000 పారితోషకం అందించనున్నట్లు తీర్మానంలో పేర్కొన్నారు.బెల్ట్ షాపులను రద్దు చేస్తూ తీర్మానం చేసిన గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల వెంకటేష్, ఉప సర్పంచ్ కస్తూరి శ్రీనాథ్,గ్రామ పంచాయితీ వార్డు సభ్యులను గ్రామస్తులు, మహిళలు అభినందిస్తున్నారు.సోషల్ మీడియాలో పాలక వర్గానికి హాట్సాఫ్ అంటూ హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలుపుతున్నారు.


గ్రామపంచాయితీ కార్యాలయం మడిపల్లి

మంథని ప్రభుత్వ విద్యా సంస్థలను సందర్శించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు

మంథని రూరల్ ప్రభాతవార్త:



తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా తెలంగాణ విద్యాశాఖ చీఫ్ ఇంజనీర్ షాఫీ మియా మరియు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఉషారాణి సోమవారం మంథనిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించిన అధికారులు, విద్యార్థులకు అవసరమైన అదనపు మౌలిక వసతులపై అధ్యయనం చేశారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, క్రీడా మైదానాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఫర్నిచర్ తదితర అవసరాలపై సంబంధిత అధికారులతో చర్చించి వివరాలు సేకరించారు.తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి భవిష్యత్తు పరిరక్ష కార్మికుల సమస్యల కు శాశ్వత పరిష్కారం

ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్

రామగిరి ప్రభాతవార్త



సింగరేణి సంస్థ భవిష్యత్తు పరిరక్షణ మరియు కార్మికుల శాశ్వత పరిష్కారం ఐఎన్టీయూ తోనే సాధ్యమని ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం రామగుండం ఆర్ జి 3 ఏరియాలోని ఓసిపి 2 లో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి అధ్యక్షతన గెట్ మీటింగ్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ మరియు ఐ ఎన్టియుసి సెక్రెటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు.సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో ఐఎన్టియుసి ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. మెడికల్ బోర్డు వ్యవస్థనుపునరుద్ధరించేందుకు యాజమాన్యంతో పాటు ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం సాధించిన ఘనత ఐఎన్టీయూసీ కే దక్కుతుందన్నారు. గుర్తింపు సంఘం వైఫల్యం కారణంగా నిలిచిపోయిన నియామక పత్రాల పంపిణీని కూడా ప్రభుత్వ స్థాయిలో ప్రస్తావించి పునఃప్రారంభించేందుకు కృషి చేసినది ఐఎన్టియుసి నే అని తెలిపారు.వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు పెర్క్స్ పై విధిస్తున్న ఆదాయపు పన్ను రద్దు కోసం ఐఎన్టియుసి పోరాటం కొనసాగిస్తుందని, మారు పేర్ల మార్పు సమస్య పరిష్కారం కోసం యూనియన్-యాజమాన్య సంయుక్త కమిటీకి ఇప్పటికే ప్రతిపాదనలుసమర్పించినట్లు తెలిపారు. కార్మికుల సొంత ఇంటి కలను కూడా కచ్చితంగా సాకారం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ఎం ఎం డి ఆర్ చట్టానికి మద్దతు, బొగ్గు గనుల వేలం ప్రక్రియలో సింగరేణికి జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు, కేసీఆర్ ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోయగూడెం బ్లాక్-III, సత్తుపల్లి బ్లాక్-III వంటి విలువైన బొగ్గు గనులు సింగరేణికి దక్కకుండా పోవడం వల్ల సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందన్నారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితి 35 నుండి 40 సంవత్సరాలకు పెంపు, శాశ్వత కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా, కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల బీమా, లాభాల వాటా, బిసి లైజనింగ్ అధికారుల నియామకం, సోలార్ మరియు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల విస్తరణ, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు ప్రక్రియ వంటి పలు చారిత్రాత్మక నిర్ణయాలు అమలులోకి వచ్చాయని పేర్కొన్నారు. .ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి, వైస్ ప్రెసిడెంట్ దాస్, సెక్రటరీలు గడ్డం తిరుపతి యాదవ్, ఎల్లంకి రామారావు, ఉయ్యాల కుమారస్వామి, పిట్ సెక్రటరీలు రామిడ్ల మనోహర్, కె ఎన్ చారి, రాజ్‌కుమార్ మరియు కేంద్ర, బ్రాంచ్ మరియు పిట్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

రామగిరి ప్రభాతవార్త



లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సెంటినరీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, క్లబ్ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా విచ్చేసిన జిల్లా మాజీ గవర్నర్ లయన్ డా. విజయ రేకులపల్లి నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షురాలిగా డా. శరణ్య యాదవ్, కార్యదర్శిగా కాటం సత్యం, కోశాధికారిగా టి.వి. సురేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా బుద్యార్థి బుచ్చన్నతో పాటు వివిధ చైర్ పర్సన్‌లు బాధ్యతలు స్వీకరించారు.అనంతరం డా. విజయ రేకులపల్లి మాట్లాడుతూ గత పాలకవర్గం సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిందని, ఒకే సంవత్సరంలో 165 సేవా కార్యక్రమాలను నిర్వహించి 7,539 మంది లబ్ధిదారులకు సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో నూతన పాలకవర్గం మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షి ంచారు.ఈ సందర్భంగా గత సంవత్సరంలో నేత్రదానం చేసిన 22 మంది నేత్రదాతల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే 14 మంది నూతన సభ్యులను లయన్స్ క్లబ్‌లోకి ఆహ్వానించి సభ్యత్వ పత్రాలను అందజేశారు.నూతన అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకవర్గం చూపిన సేవా మార్గంలో ముందుకు సాగుతూ, విద్య, వైద్యం, పర్యావరణం, మానవతా సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ క్లబ్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జి.ఎస్.టి కోఆర్డినేటర్ సాదుల వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ రామకిషన్, రీజనల్ చైర్మన్ కావేటి రాజగోపాల్, జోనల్ చైర్మన్ భాస్కర్ రావు, వేల్పుల రమేష్, సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ చైర్ పర్సన్‌లు, మహిళా చైర్ పర్సన్‌లు, సభ్యులు మరియు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అత్యంత పారదర్శకంగా సింగరేణిలో బొగ్గు రవాణా

కిలో బొగ్గు కూడా పక్కదారి పట్టే ఆస్కారం లేదు

ఆర్ జి త్రీ జిఎం లు

రామగిరి ప్రభాతవార్త



సింగరేణి లో (ఎస్‌సీసీఎల్) లో బొగ్గు రవాణా వ్యవస్థ అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా కొనసాగుతోం దని, ఒక కిలో బొగ్గు కూడా పక్క దారి పట్టే ఆస్కారం లేదని ఆర్ జీ 3 జిఎం మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా ఇన్చార్జి జీఏం బండి సత్యనారాయణ తెలిపారు. సోమవారం జిఎం కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాట్ చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారునికి చేరే వరకు ప్రతి దశను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షి స్తున్నట్లు పేర్కొన్నారు.ఇటీవల బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో చోరీలు జరుగుతున్నాయంటూ వస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరమని సంస్థ స్పష్టం చేసింది. బొగ్గు రవాణాలో జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ, సీసీటీవీ, జియో ఫెన్సింగ్, డిజిటల్ వెయిబ్రిడ్జ్‌లు వంటి ఆధునిక వ్యవస్థలు అమల్లో ఉండటంతో అక్రమాలకు అవకాశం లేదని వెల్లడించింది.సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా అవుతోంది. హైదరాబాద్‌లోని మార్కెటింగ్ విభాగం ద్వారా ఈ-వేలం ఆధారిత వ్యవస్థలో బొగ్గు కేటాయింపులు జరుగుతాయని, ఏ వినియోగదారుడు ఎంత బొగ్గు ఎక్కడి నుంచి స్వీకరించాలో ముందుగానే డిజిటల్‌గా నమోదు అవుతుందని అధికారులు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో నాణ్యత విభాగం రామగుండం రీజియన్ జనరల్ మేనేజర్ సుజయ్ మోజుందార్,ఎస్ ఓ టు జిఎం రాం మోహన్, పర్సనల్ డి జీ ఏం సుదర్శన్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షబీరుద్దీన్, ఐటీ మేనేజర్ ఆర్, రాజేశ్వరి, నాణ్యత విభాగాధిపతి ఆసిఫ్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కి విదార్థులు దూరంగా ఉండాలి

ఎస్సై తాడవేని శ్రీనివాస్

రామగిరి ప్రభాతవార్త



విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని, బాగా చదువుకొని భవిషత్తు లో గొప్ప స్థాయికి చేరుకోవాలని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగిరి పోలీస్ స్టేషన్ పరిధి బేగంపేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్ పై విదార్థులకు అవగాహన కల్పించారు. జీవితాల్లో డ్రగ్స్ ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పి వాటికి దూరంగా ఉండాలని, విద్యాసంస్థల్లోకి అటువంటి ప్రభావం పడకుండా చూడాలనీ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై తాడవేని శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల విద్యార్థుల బంగారు భవిష్యత్ దెబ్బతింటుందని, కేసులతో ఇబ్బందులు పడడమే కాకుండా ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, సమాజంలో మనకున్న సంబంధాలు మొత్తం కట్ అయిపోతాయని తెలిపారు.డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు,ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు.చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటువ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్ఐ స్వామి, హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు మల్క రామ్ కిషన్ రావు, పద్మజ, శ్రీనివాస్, సంపత్ కుమార్, మంగ, పి ఈ టి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బూజు పట్టిన రెస్టారెంట్లు

గోదావరిఖనిలో ఫుడ్ సేఫ్టీ దాడులు..

రెస్టారెంట్లలో షాకింగ్ అక్రమాలు వెలుగులోకి

ఫుడ్ పాయిజనింగ్ ఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక తనిఖీలు

10 హోటళ్లు, బేకరీల్లో తనిఖీలు..

నిబంధనల ఉల్లంఘనలపై అధికారుల ఆగ్రహం

అపరిశుభ్ర వంటగది, నిషేధిత ఆహార రంగులు స్వాధీనం..



గోదావరిఖని, ప్రభాతవార్త:గత వారం గోదావరిఖనిలో నమోదైన ఫుడ్ పాయిజనింగ్ ఘటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆహార భద్రతా శాఖ అధికారులు ఆదివారం ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు రెస్టారెంట్లు, బేకరీలను ఆకస్మికంగా తనిఖీ చేయగా ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి రావడంతో అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) అంకిత్ రెడ్డి ఆధ్వర్యంలో బాలాజీ విక్స్ స్వీట్ హౌస్, తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, దసరా దావత్ రెస్టారెంట్, ఎస్ఏ అన్‌లిమిటెడ్ కేఫ్ అండ్ బేకర్స్, వాసంతి లైవ్ కిచెన్, ఏకే మల్టీబైట్స్ బేకర్స్, దియా ఫ్యామిలీ రెస్టారెంట్, జాయికా మండీ హౌస్, బేకర్స్ డిలైట్ ది లైవ్ కేక్ షాప్, డేనియల్స్ కేక్ షాప్‌లను తనిఖీ చేశారు.తనిఖీల్లో కొన్ని రెస్టారెంట్లలో ఆహార పదార్థాల తయారీలో రంగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఆహార భద్రతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న రంగులను స్వాధీనం చేసుకుని వెంటనే పారవేశారు. వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలను కూడా ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు.అత్యంత ఆందోళనకరంగా ఎస్ఏ అన్‌లిమిటెడ్ కేఫ్ అండ్ బేకర్స్ వంటగది పూర్తిగా అపరిశుభ్ర పరిస్థితుల్లో ఉన్నట్లు గుర్తించారు. పరిశుభ్రత ప్రమాణాలు తీవ్రంగా ఉల్లంఘించబడినట్లు తేలడంతో సంబంధిత యాజమాన్యానికి లోపాలను సరిదిద్దేందుకు ఒక వారం గడువు విధించారు. నిర్దేశిత గడువులో మార్పులు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇక జాయికా మండీ హౌస్‌లో లభించిన మయోనైస్ ముడి గుడ్లతో తయారై ఉండవచ్చనే అనుమానంతో నమూనాలను సేకరించారు. ముడి గుడ్లతో మయోనైస్ తయారీ ఆహార భద్రతా నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. నమూనాల పరీక్షా నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.గోదావరిఖనిలో వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే ఆహార వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ శాఖ హెచ్చరించింది.

సేవా పథంలో కొత్త అడుగులు.

లయన్స్ క్లబ్ గోదావరిఖని శతాబ్ది నూతన కార్యవర్గం

ప్రమాణ స్వీకారం

ఎన్టీపీసీ,ప్రభాతవార్త:



సమాజ సేవను ధ్యేయంగా చేసుకుని ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ గోదావరిఖని శతాబ్ది నూతన కార్యవర్గం సోమవారం ఎన్టీపీసీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రమాణ స్వీకారం చేసింది. క్లబ్ అధ్యక్షుడిగా మావిడి మహేందర్ గౌడ్, కార్యదర్శిగా పైడ సాయికుమార్ గౌడ్, కోశాధికారిగా కొండ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, పేద మరియు నిరుపేదలకు సహాయ సహకారాల అందజేత వంటి రంగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ప్రముఖులు, ఆహ్వానితులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. సమాజాభివృద్ధికి లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం నూతన బాధ్యతలు చేపట్టిన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వర్షాకాలం నేపథ్యంలో పెద్దపల్లి మున్సిపాలిటీలో ముందస్తు ప్రణాళికలులోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు.

లక్ష్మీ ్మ నగర్ లో యూజీడీ పనులు పూర్తి

నిరుపేద కుటుంబానికి 50 కేజీల బియ్యం సాయం

అందజేసిన మున్సిపల్ చైర్మన్

పెద్దపల్లి, ప్రభాతవార్త:

వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పెద్దపల్లి పట్టణ ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పిలుపునిచ్చిన నెల రోజుల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని 10, 11 వార్డులలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య స్వయంగా పర్యటించారు. కాలువల పూడికతీత, మురికి నీటి నిల్వల తొలగింపు పనులను పర్యవేక్షి స్తూ, సీజనల్ వ్యాధుల పట్ల వార్డు ప్రజలను మరియు అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటో రిక్షాలకు అందించాలని కోరారు. వార్డుల్లో మురికి కాలువలు లేని ప్రాంతాల్లో కచ్చా కాలువలు తీపిస్తున్నామని, 10వ వార్డు లక్ష్మీ ్మ నగర్ లో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజి) నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు.ఇదే సమయంలో కొన్నిచోట్ల పాత కరెంటు స్తంభాల తొలగింపు, నూతన స్తంభాల ఏర్పాటు అవసరమని 10వ వార్డు కౌన్సిలర్ అక్కేపల్లి సుజాత క్రాంతి చైర్మన్ దృష్టికి తీసుకురాగా.. ఎలక్ట్రికల్ డీఈతో మాట్లాడి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ లో ఉన్న సీసీ డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఇటీవల మరణించిన 10వ వార్డు నివాసి బసంత్ లాల్ నిరుపేద కుటుంబానికి కౌన్సిలర్ అక్కేపల్లి సుజాత క్రాంతి ఆధ్వర్యంలో చైర్మన్ చేతుల మీదుగా 50 కేజీల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చైర్మన్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అక్కేపల్లి సుజాత క్రాంతి, పూదరి అనూష మహేందర్, వార్డ్ ఆఫీసర్లు శ్రీనివాస్, సాగర్, సానిటరీ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి, బిల్ కలెక్టర్ సుధాకర్, జవాన్ వేణు లాల్, ఆర్పీలు స్రవంతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న కొయ్యాడ శ్రీనివాస్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్

పెద్దపల్లి, ప్రభాతవార్త:



రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న కొయ్యాడ శ్రీనివాస్ సేవాభావాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్ అభినందించారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలో అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైన సందర్భంలో కొయ్యాడ శ్రీనివాస్ ముందుకు వచ్చి స్థానిక సివిల్ హాస్పిటల్‌లో స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటివేటర్ రక్త ధాత సముద్రాల రాజకుమార్ పాల్గొని రక్తదానం చేసిన కొయ్యాడ శ్రీనివాస్‌ను అభినందిస్తూ అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో స్పందించి ప్రాణదాతగా నిలవడం అభినందనీయం అన్నారు. రెడ్ క్రాస్ సభ్యులు ప్రజలను స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సరికొత్త రికార్డు

కుట్లు లేకుండా విజయవంతంగా సర్జరీ పూర్తి చేసిన వైద్య బృందం

అధునాతన కార్పొరేట్ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

సూపరింటెండెంట్ డాక్టర్ కే శ్రీధర్

పెద్దపల్లి, ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో లేజర్ పద్ధతి ద్వారా అర్షమొలల (ఫైల్స్) ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. సాధారణంగా ఈ ఆసుపత్రిలో సాంప్రదాయ పద్ధతిలో ఫైల్స్ ఆపరేషన్లు జరుగుతూ ఉంటాయి, కానీ లేజర్ సాంకేతికతను ఉపయోగించి శస్త్ర చికిత్స చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సరికొత్త లేజర్ సర్జరీ విధానంలో శరీరానికి ఎలాంటి కోత మరియు కుట్టు అనేవి ఉండవని వైద్యులు తెలిపారు. దీనివల్ల రోగికి నొప్పి కూడా చాలా తక్కువగా ఉంటుందని, ఆపరేషన్ జరిగిన కేవలం రెండు రోజులలోనే పేషెంట్ తన యొక్క అన్ని దైనందిన పనులు స్వయంగా చేసుకోగలరని వివరించారు. ఇలాంటి ఆధునిక కార్పొరేట్ స్థాయి వైద్యం కరీంనగర్ లోనే చాలా తక్కువ ప్రైవేట్ ఆసుపత్రులలో అందుబాటులో ఉందని, అసలు ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ రకమైన లేజర్ సర్జరీలు చేయడం చాలా అరుదని పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంతటి గణనీయమైన అభివృద్ధికి కారణమైన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావుకు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఐఏఎస్ కు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందుతున్న ఇలాంటి అధునాతనమైన వైద్య సేవలను పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో కోరారు.

సిపిఐ సీనియర్ నాయకుడి మృతి బాధాకరం

సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కుందేల్ల వెంకటి అనే రైతు తన వ్యవసాయం పొలం వద్ద పనిచేస్తుండగా పడదెబ్బ తగిలి మృతి చెందడం అత్యంత బాధాకరమని సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు.మృతుడి కుటుంబాన్ని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పరామర్శించారు. సోమవారం రోజున బొమ్మనపల్లి లో కుందేళ్ళ వెంకటి మృతదేహంపై సిపిఐ నాయకులు ఎర్రజెండా కప్పి నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూకుందేల్ల వెంకటి నిబద్ధత గల కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త అని నిరంతరం పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే వాడని, పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తూ ఉండి క్రమశిక్షణకు కట్టుబడి ఉండే వ్యక్తి మృతి చెందడం చాలా బాధాకరమని,ఆయన మృతి పట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ పార్టీ అండగా ఉంటుందని లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మనపల్లి సిపిఐ గ్రామ కార్యదర్శి అందే సంపత్, ఉప సర్పంచ్ కాసర్ల హరీష్, సిపిఐ నాయకులు బండారు తిరుపతి,మొగిలి ఓదెలు, విలాసాగరం అంజయ్య,శ్రీనివాస్,వెంకటేష్, నరేష్ ,సిపిఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మానకొండూర్ సిఐ, శ్రీలత

మానకొండూర్, ప్రభాతవార్త :



విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మానకొండూరు సిఐ, శ్రీలత తెలిపారు. సోమవారం మానకొండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీలత మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక మానసిక సామాజిక పుష్పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు లోనై, మంచి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు గొప్పగా ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. అనంతరం విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ , ఎస్సై తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ తల్లం కాంప్లెక్స్‌లో తైక్వాండో బెల్ట్ టెస్ట్ నిర్వహణ

పలుగురు విద్యార్థులకు బెల్టులు ప్రదానం

వేములవాడ టౌన్ ప్రభాతవార్త

వేములవాడ తల్లం కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న తైక్వాండో తరగతుల్లో సోమవారం తైక్వాండో బెల్ట్ టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది విద్యార్థులు యెల్లో బెల్ట్‌కు ప్రమోట్ అయ్యారని కోచ్ ఆర్. సుజీవన్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తల్లం రాజు, రాజేందర్ మాస్టర్, వంశీ కృష్ణ హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ కోసం సీకే తైక్వాండో టీమ్ ఎగ్జామినర్లుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోచ్ ఆర్. సుజీవన్ మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా శారీరక దృఢత్వం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ పెరుగుతాయని, ఆరోగ్యంగా ఉండేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే బాలికలకు తైక్వాండో ఒక ఉత్తమమైన స్వీయ రక్షణ సాధనంగా ఉపయోగపడుతుందని వివరించారు.విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించి తమ తల్లిదండ్రులకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు తైక్వాండో శిక్షకులు పాల్గొన్నారు.

కుడిచెరువు కట్టపై అగ్నిప్రమాదం

కాలి బూడిదైన తాటి చెట్లు

చొప్పదండి,ప్రభాతవార్త:

చొప్పదండి పట్టణంలోని కుడి చెరువు కట్టపై అగ్నిప్రమాదం. కట్ట సమీపంలో సోమవారం ఎవరో గుర్తు తెలియని వ్యక్తి స్మోకింగ్ చేసి పడేయడంతో గాలి తీవ్రతకు మంటలు వేగంగా వ్యాపించాయి. కట్టను ఆనుకొని ఉన్న దాదాపు 20కి పైగా తాటి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ మంటలు గాలికి అగ్గి రవ్వలు సమీపంలోని ఇండ్లలోకి ఎగిరి పడడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే వార్డు కౌన్సిలర్, వైస్ చైర్ పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య దృష్టికి తీసుకెళ్లడంతో వారు ఫైర్ ఇంజన్ కి సమాచారము ఇచ్చారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలం కి సకాలంలో చేరుకోకపోతే ఈ మంటలు ఇండ్లలోకి వ్యాపించి తీవ్ర ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు.

ప్రముఖ వ్యాపారి మంచాల రామేషం కునివాళులర్పించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారులు మంచాల కృష్ణ తండ్రి మంచాల రామేశం పెద్ద కర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్ర పటానికి నివాళులు అర్పించారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ రాధిక దంపతులు,మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాని శ్రీనివాస్ దంపతులు.

పాఠశాల నుంచి ఆసుపత్రి వరకు...!..

ప్రజా సేవలపై రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి నిశిత పరిశీలన

లక్ష్యంతో చదవండి.. ఉన్నత శిఖరాలు అధిరోహించండి.

ప్రజా పాలన ప్రగతిపై క్షేత్రస్థాయి సమీక్ష..

విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి..

అభివృద్ధి పనుల అమలే లక్ష్యం....

జిల్లా పర్యటనలో రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి: సిక్తా పట్నాయక్

కొడిమ్యాల, ప్రభాతవార్త:







జగిత్యాల జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారి, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సోమవారం జిల్లాలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కొడిమ్యాల మండలంలోని పూడూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన సిక్తా పట్నాయక్, భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పూర్తిగా అందుతున్నాయా అని తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా, ఇతర సౌకర్యాలపై నేరుగా విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పాఠశాల డైనింగ్ హాల్, వంటశాలను పరిశీలించి మధ్యాహ్న భోజనము నిర్వహణలో నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, ఎల్పీజీ గ్యాస్ వినియోగం, కిచెన్ గార్డెన్ నిర్వహణను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. గత ఏడాది పదవ తరగతి ఫలితాలపై జిల్లా విద్యాశాఖాధికారిని అడిగి తెలుసుకున్న ఆమె ఉపాధ్యాయుల హాజరు, బోధన నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. విద్యనే జీవితంలో అత్యంత విలువైన సంపదగా భావించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. తదుపరి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, విద్యాశాఖ, వైద్యశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ వద్ద పోలీసు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలి

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త::



జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత పెట్రోల్, డీజిల్ పంపును తక్షణమే ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను కలిసి లేఖను అందజేసినట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు.సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖను సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్కు అందజేశారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, పాత బస్టాండ్ సమీపంలోని పోలీసు క్వార్టర్స్ స్థలాన్ని వాణిజ్యపరంగా వినియోగించే అవకాశం ఉందన్నారు. ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు మెరుగైన సేవలు అందడంతో పాటు ట్రాఫిక్ రద్దీ సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల అనుమతులు కూడా లభించినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ పెట్రోల్ బంక్ ఆదర్శవంతంగా నిర్వహించబడితే వచ్చే ఆదాయాన్ని పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందని చెప్పారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పంపు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్ బంక్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రికి రాసిన లేఖ ప్రతిని పోలీసు ఉన్నతాధికారులకు పంపడంతో పాటు లేఖను ఉన్నతాధికారులకు అందజేసినట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల పట్టణంలోని క్రిటికల్ కేర్ హాస్పిటల్ యందు మంచాల రామేశం స్మారకార్థం మంచాల కృష్ణ ఏర్పాటు చేసిన ఆర్వో (ఆర్ ఓ) వాటర్ ప్లాంట్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మరియు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంచాల కృష్ణ వారి తండ్రి మంచాల రామేశం జ్ఞాపకార్థం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని, మంచాల రామేశం స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్ రోగులు, వారి సహాయకులు మరియు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సమాజ సేవ కార్యక్రమములలో మంచాల కృష్ణ ఎపుడు ముందు ఉంటారని, సమాజ సేవా కార్యక్రమాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని, ఇలాంటి కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ కృష్ణమూర్తి,ప్రిన్సిపాల్ సునీల్, ఎ ఎం సి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,కౌన్సిలర్ జంబర్తి గంగా లక్ష్మీ రాజ్ కుమార్, క్యాదసు నవీన్, రోటరీ క్లబ్ సభ్యులు టివి సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్ ఆర్ ఎం ఓ మంచాల కృష్ణ మరియు కుటుంబ సభ్యులు, ముసుకు ఎల్లారెడ్డి పట్టణ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, వసతులు..

అంగన్వాడి విద్యార్థులకు ఉచిత స్కూల్ డ్రెస్సులు పంపిణీ..

సర్పంచ్ తోట శ్రీనివాస్.

బీర్ పూర్ ప్రభాత వార్త.



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కమ్మునూర్ గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కమ్మునూర్ గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ చేతుల మీదుగావిద్యార్థులకు ఈ దుస్తులను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సర్పంచ్ అందిస్తున్న నిరంతర సహకారంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడిందని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ తోట శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి తల్లిదండ్రులూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల వికాసానికి అవసరమైన అనేక అద్భుతమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యార్థుల విద్యాభ్యాసానికి చేదోడుగా నిలిచేందుకు ప్రభుత్వం అందిస్తున్న 21 రకాల వస్తువులతో కూడిన కిట్లను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి అందిస్తున్న ఇటువంటి ఉన్నతమైన విద్యా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కమ్మునూర్ ప్రభుత్వ పాఠశాలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు తాము నిరంతరం కృషి చేస్తున్నామని సర్పంచ్ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాస్, స్థానిక అంగన్‌వాడీ టీచర్ అనూష, గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మణ్ , పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడి గా సామల గంగాధర్

ఘనంగా సన్మానించిన బిజెపి నాయకులు

బీర్‌పూర్, ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో పద్మశాలి సేవా సంఘం నూతన అధ్యక్షుడి గా సామల గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పద్మశాలి సమాజం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి సేవా సంఘం అభివృద్ధికి, సంఘ బంధువుల సంక్షేమానికి తాను నిరంతరం శ్రమిస్తానని, అందరినీ కలుపుకుంటూ సమాజ సేవలో ముందంజలో ఉంటానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి బండారి రవి, ఉపాధ్యక్షులు గర్షకుర్తి రమేష్ , సీనియర్ నాయకులు రఘువీర్ రెడ్డి, కస్తూరి లక్ష్మణ్, ఉమేష్ రెడ్డి, మామిడిపెల్లి లింగన్న, రామన్న, రాజేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త

:ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగారపు రజనీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులవుతున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రజనీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 12 నాటికే విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అవి పూర్తిస్థాయిలో అందలేదన్నారు. ముఖ్యంగా కొన్ని పాఠ్యపుస్తకాల టైటిల్స్ అసలు అందుబాటులోనే లేవని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో అనేక లోపాలున్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడం వల్లే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని అన్నారు. అక్షయపాత్ర, ఇస్కాన్, మన్నా వంటి సంస్థలు అందిస్తున్న భోజనం నాణ్యతపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు పెంచి నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రైవేట్,



కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేశాయని ఆయన మండిపడ్డారు. ఆకర్షణీయమైన పేర్లతో ప్రచారాలు చేస్తూ నర్సరీ స్థాయి నుంచే లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, నోట్‌బుక్స్, టైలు, షూలు, బెల్టులు తదితర వస్తువులను పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఖిఫీజుల నియంత్రణ చట్టాన్నిఖి ప్రభుత్వం వెంటనే తీసుకువచ్చి పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సుమారు 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4,000 పాఠశాలలుగా కుదించాలనే ప్రభుత్వ ప్రతిపాదన పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ప్రభుత్వ విద్యా వ్యవస్థకే గొడ్డలిపెట్టుగా మారుతుందన్నారు. పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకుని, పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ఉన్న పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ, ముబారక్, నాయకులు స్నేహిత, ఆఫియా, ఆదిత్య, వరుణ్, అనీష్, జస్వంత్, అక్షయ్, వినీత్, హరి చరణ్, వివేక్, మణిదీప్, రీషి కుమార్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పానీ పూరి విక్రయ కేంద్రాలపై చర్యలు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: ఆహార భద్రత నిబంధనలు పాటించని పలు పానీ పూరి విక్రయ కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా పానీపూరి విక్రయ దుకాణాల్లో ఇటీవల తనిఖీ చేశారు.సిరిసిల్లలోని కైలాస్ పానీ పూరి, శివ్ కైలాస్ బేల్, అలాగే వేములవాడ లోని అనిల్ పానీ పూరి, శ్రీ బాలాజీ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్, సాయి చాట్ భండార్, దేవీ నారాయణ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్ లో తనిఖీ చేయగా, అపరిశుభ్రమైన పరిసరాల్లో తయారు చేసిన పానీ పూరీలు, పప్పు, పరిశుభ్రంగా లేని నీరు, ఉల్లిగడ్డలు, ఆలు గడ్డలు అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. సరైన ఆహార భద్రత ప్రమాణాలు పాటించని ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో నిరంతరం ఆకస్మిక తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు

మృతుని కుటుంబానికి గ్రామస్తుల ఆర్థిక సాయం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలములోని పత్తికుంటపల్లె గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన గుడిసె మల్లయ్య ఇటీవల అనారోగ్యముతో మరణించగా గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సోమవారం ఆర్థిక సాయం అందించారు.గ్రామస్తుల సహాయ సహకారాలతో 55 వేల రూపాయలు నగదు విరాళాలు సేకరించి మృతుని కుమారుడు బీరయ్యకు అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శేఖర్,మాజీ ఎంపిపి ఐలయ్య,భూపతిరెడ్డి, రమణారెడ్డి, తిరుపతి రెడ్డి,నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు

నకిలీ ట్రక్ చిట్టీలు సృష్టించి ప్రభుత్వ ధాన్యాన్ని మళ్లించిన కేసులో మరో నిందుతుడు అరెస్టు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త



ట్రక్ చిట్టీలు స్వాధీనంవివరాలు వెల్లడించిన పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్నకిలీ ట్రక్ చిట్టీలు సృష్టించి ప్రభుత్వ ధాన్యాన్ని మళ్లించిన కేసులో మరో నిందుతుడు అరెస్టు రిమాండ్ కు తరలిస్తున్నట్లు పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా సి.ఐ మాట్లాడుతూ రుద్రంగి మండలానికి చెందిన గడ్డం నర్సారెడ్డి, అప్పారెల్ పార్క్ గోదాముల వద్ద పనిచేస్తున్న విజయ్‌కుమార్, గణేష్‌లతో కలిసి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డాడు. గోదాముల్లో నిల్వల లెక్కలు సరిగా గుర్తించడం కష్టమనే విషయాన్ని ఆసరాగా తీసుకుని, వాస్తవంగా వడ్ల పంపకుండానే రైతుల పేర్లతో నకిలీ ట్రక్ చిట్టీలను సృష్టించి గోదాములకు ధాన్యం చేరినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈక్రమంలో జూన్ 5న 378 క్వింటాళ్లు, జూన్ 9న 316 క్వింటాళ్ల ధాన్యం పంపినట్లు నకిలీ ట్రక్ చిట్టీలు రూపొందించగా, రైతుల ఖాతాల్లో ప్రభుత్వ నిధులు జమయ్యాయి. అనంతరం రైతులను మభ్యపెట్టి నగదు వసూలు చేసి, అందులో కొంత మొత్తాన్ని సహ నిందితులకు బదిలీ చేశారు.ఈనేపథ్యంలో ఈకేసులో అరుగురు నిందుతులను అరెస్ట్ చెసి రిమాండ్ కి తరలించగా, ఈ రోజు గడ్డం నర్సారెడ్డి ని అరెస్ట్ చేసి తన వద్ద నుండి రూ.4 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్ కి తరలించినట్లు సి.ఐ తెలిపారు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



స్థానిక పోలీస్ స్టేషన్ లో విద్యార్థులకు చట్టాలపై సోమవారం అవగాహన కలిపించారు.ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ స్టేషన్ పరిధిలో జరిగే పనుల గూర్చి వివరించారు.అనంతరం డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాల గూర్చి వివరించారు.విద్య వల్ల కలిగే ప్రయోజనాలను సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు

మత్తుతో జీవితాలను చెరిపేసుకోవద్దు

మోత్కూర్ జూన్ 22 ప్రభాతవార్త

యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను చెరిపేసుకోవద్దని మోత్కూర్ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కే రవిచంద్ర రెడ్డి అన్నారు. సోమవారంప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో డ్రగ్స్ నిరోధంపై ప్రతిజ్ఞ చేయించారు అనంతరం సిఐ కే రవిచంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని మంచి అవగాహనతో ఉన్నతమైన చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. నషా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ ఆర్ రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టూడెంట్స్ కౌన్సిలర్ సిహెచ్ లింగస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కే నర్సింహారెడ్డి, అధ్యాపకులు పురుషోత్తం రెడ్డి, కే శ్యాము, వై నర్సిరెడ్డి, డి మంజుల బి నరసింహ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు

ప్రధాని మోదీ 12 ఏళ్ల సుపరిపాలన

సిరిసిల్లలో ఘనంగా మేధావుల సమ్మేళనం

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:



ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మేధావుల సమ్మేళనం ఘనంగా జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుజరాత్ సీఎంగా 13 ఏళ్లు, ప్రధానిగా 12 ఏళ్లు.. మొత్తం 25 ఏళ్లుగా మోదీ నిరంతర ప్రజాసేవలో ఉన్నారని కొనియాడారు. ఖిసబ్ కా సాథ్‌సబ్ కా వికాస్ఖి నినాదంతో, అనేక సంక్షేమ పథకాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఖివికసిత్ భారత్2047ఖి సాధనలో మేధావులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు మేధావులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులైన భీమనపల్లి శ్రీలత, ఆడెపు లత, వేముల శ్రీలత, బండారు దివ్యలను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతి, సిరికొండ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు గరిపెల్లి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, వర్గాల లక్ష్మీనవీన్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రాజాసింగ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, నవతెలంగాణ జిల్లా రిపోర్టర్ భద్రాచలం, అయ్యప్ప స్వామి ఆలయ చైర్మన్ రాచర్ల విద్యాసాగర్ స్వామి, టెక్స్ టైల్ పార్క్ అధ్యక్షులు అన్నదాసు అనిల్, ప్రైవేట్ విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, సెన్సార్ బోర్డు సభ్యురాలు శ్రీమతి వేముల వైశాలి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు మరియు పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

విద్యార్థికి ఆర్థిక సాయం అందించిన కేటీఆర్



ముస్తాబాద్ ప్రభాత వార్త:

ముస్తాబాద్ మండలం అవునూర్ గ్రామానికి చెందిన లక్ష్మి ప్రసన్న బాసరలో సీటు సాధించిన చదువుకోవడానికి డబ్బులు లేని పరిస్థితి.చిన్న మెసేజ్ కు స్పందించిన కేటీఆర్ పుస్తకాలకు,ఇతరత్రా ఖర్చుల కోసం 20 వేల రూపాయలు సోమవారం ఆర్థిక సాయం అందించారు.ఈ ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొంపెల్లి సురేందర్ రావు,పార్టీ నాయకుల ఆధ్వర్యములో అవునూర్ గ్రామంలో ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమములో మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య,అవునూర్ గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నాల పద్మ రెడ్డి,దాసరి విశ్వనాథం,కుంబాల మల్లారెడ్డి,పొన్నాల సతీష్,యూత్ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.